

స్మార్ట్ కార్డుల పంపిణీలో జాప్యం

- అధికారులపై వెల్లువెత్తుతున్న విమర్శలు

చీరాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు దారులకు స్మార్ట్ కార్డుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టగా ఎక్కడికక్కడ అధికారులు పట్టించుకోవడంలేదు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టులోనే స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. మూడు మాసాలు గడుస్తున్నా కార్డుదారులకు పూర్తిస్థాయిలో కార్డులు అందలేదు.

అధికారులు, డీలర్ల మధ్య సమన్వయలోపం

తొలుత కార్డుల పంపిణీ అధికారుల పర్యవేక్ష ణలో జరిగింది. ఆ తర్వాత వాటి బాధ్యతను డీల ర్లకు అప్పగించారు. అయితే వారు కుదిరిన సమ యాల్లోనో, లేక కార్డుదారులు వెతుక్కుంటూ వచ్చిన ప్పుడు మాత్రమే కార్డులు అందజేస్తున్నారు. ఇప్పటికీ చాలావరకు పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది.

నూజెళ్లపల్లె సొసైటీ ఉద్యోగుల అరెస్టు

- మాజీ అధ్యక్షుడి సహా.. ఏడుగురికి రిమాండ్

వంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్లపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మూడేళ్ల క్రితం జరిగిన కుంభకోణంలో ఎనిమిది మంది ఉద్యోగులను అరెస్టు చేసినట్లు అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. సొసైటీలో రూ.కోట్లలో నగదుతో పాటు బంగారం కూడా మాయమైనట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ జరిపారు. ఈ కుంభకోణంలో అప్పటి సొసైటీ అధ్యక్షుడు పెంట్యాల భద్రయ్య, సీఈవో అద్దంకి రవిబాబు, స్వీపర్ చెరుకూరి శివప్రసాద్, కొండ్రగుంట రవిబాబు, మద్దినేని సుబ్బ రామయ్య, నగరాజకుమారి, పాలపర్తి పోతురాజుతో పాటు మరోవ్యక్తి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో వీరిలో ఏడుగురిని అరెస్టు చేసి అద్దంకి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మరోవ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

15 నుంచి ధాన్యం సేకరణ

- జిల్లాలో 114 కేంద్రాల్లో కొనుగోళ్లు
- 2 లక్షల మెట్రిక్ టన్నులకు అనుమతి
- మిల్లర్ల మాయాజాలంపై ప్రత్యేక దృష్టి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించడానికి సివిల్ సప్లయిస్ విభాగం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ నెల 15 నుంచి జిల్లా వ్యాప్తంగా 114 కేంద్రాల్లో కొనుగోళ్లు జరపడానికి యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తోంది. గత ఖరీఫ్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్‌లో రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులివ్వాలంటూ సివిల్ సప్లయిస్ విభాగం కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వైసీపీ హయాంలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ 40,000 టన్నులకు మించలేదు. వాటి తాలూకా డబ్బులకు కూడా రైతులు నెలల తరబడి నిరీక్షించాల్సిన దురవస్థను రైతులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో దశల వారీగా 92,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం సేకరించింది. ఓ విధంగా ఇవే రికార్డు కొనుగోళ్లుగా అప్పట్లో నిలిచాయి. ఈ ఏడాది ఏకంగా ఆరంభంలోనే రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులివ్వడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలు అరికట్టడానికి...

ధాన్యం సేకరణలో అక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. అన్నదాతలు రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) వద్దే ధాన్యం తేమశాతం పరీక్షతో పాటు అక్కడే కొనుగోళ్లు జరపనున్నారు. రసీదు అందించి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీని వల్ల రైతులకు లాభం చేకూరనుంది. కల్లాల నుంచి నేరుగా రైస్ మిల్లులకు ధాన్యాన్ని తీసుకెళ్లి ఆ తర్వాత రైతు సేవా కేంద్ర వద్ద నమోదు చేసే విధానానికి స్వస్తి పలికారు. దీని వల్ల సీఎంఆర్ లో అక్రమాలను కూడా అరికట్టి, రైతులు తరలించి న ధాన్యమే మిల్లుల్లో సీఎంఆర్ ప్రక్రియ జరగనుంది. గతంలో మిల్లర్లు రైతుల వద్ద నుంచి మద్దతు ధర కన్నా కూడా రెండు మూడొందలు తక్కువ చెల్లించి పెద్దఎత్తున ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేవారు. పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లతో కొంతమంది సిబ్బందికి ముడుపులు చెల్లించి ఆ ధాన్యాన్ని మద్దతుధర సేకరణ జాబితాలో చేర్చి పెద్ద ఎత్తున లాభపడేవారు. ప్రస్తుతం జీపీఎస్ అమలుతో పాటు తొలుత ధాన్యం ఆర్ఎస్‌కే కేంద్రం వద్దకే రావాల్సి ఉంది. అక్కడ నుంచే రైతులు మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తప్పవనే సంకేతాలను ఇప్పటికే ప్రభుత్వం పంపింది. తద్వారా రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. కాగా మొంథా తుఫాన్, అంతకు ముందు వచ్చిన వరదల వల్ల వరిలో ఎక్కువగా తాలు ఏర్పడిందనేది అన్నదాతల మాటగా ఉంది. తేమశాతంతో పాటు నిబంధనల విషయంలో సడలింపులు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.

తల్లిదండ్రులకు గుండెకోత

- టెక్సాస్‌లో కారంచేడు విద్యార్థిని మృతి

కారంచేడు(పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయిలో బిడ్డ వస్తాడని ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రులకు గుండెకోత మిగిలింది. అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసుకుని ఉద్యోగ వేటలో ఉండగా అనారోగ్యంతో కుమార్తె మృతి చెందిందన్న వార్త తల్లిదండ్రులను శోకసంద్రంలోకి నెట్టేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రామకృష్ణ, వీణలకు కుమారుడు, కుమార్తె రాజ్యలక్ష్మి(రాజీ 23) ఉన్నారు. కుమారుడు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా.. చదువులో రాణిస్తున్న కుమార్తెను ఆర్థిక స్తోమత లేకపోయినా బీటెక్ వరకు చదివించారు. ఆ తర్వాత ఎంఎస్ చదుకుంటాను అనగా రాజ్యలక్ష్మిని అమెరికాకు పంపారు. 2023లో ఎంఎస్ పట్టా పొంది ఉద్యోగ వేటలో రాజ్యలక్ష్మి ఉంది. ఈ క్రమంలో అనారోగ్యం బారిన పడింది. శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె స్నేహితుల నుంచి తల్లిదండ్రులు సమాచారం అం దింది. ఉన్నత ఉద్యోగంతో తిరిగి వస్తుం దని ఎదురుచూస్తున్న కుమార్తె మరణ వార్తతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్థిక భారంతో కుమార్తె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు రాలేమని తల్లిదండ్రులు ఆవేదన వర్ణతీతంగా మారింది.



యార్లగడ్డ రాజ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



- చెరుకూరులో.. కంచికామ కోటి పీఠాధిపతి
- దేవాలయాలను సందర్శించిన స్వామి.. తరలివచ్చిన భక్తులు

భారతీయ సంస్కృతి గొప్పది

చెరుకూరు(పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని శ్రీకంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతిస్వామి తెలిపారు. మండలంలోని చెరుకూరు గ్రామంలోని పురాతన ఆలయాలను శనివారం ఆయన సందర్శించారు. గ్రామానికి చేరుకున్న స్వామికి వేదపడింతులు, అర్చకులు, మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. తొలుత 300 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీగంగా పార్వతీసమేత కోటేశ్వరస్వామి, శ్రీత్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామివారి ఆలయాల్ని పీఠాధిపతి దర్శించుకున్నారు. ఆలయ చరిత్రను ధర్మకర్త పుచ్చా సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు పుచ్చా రాజగోపాల్, పుచ్చా దక్షిణామూర్తి పాల్గొన్నారు. స్వామి రాకతో గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

నేడు పెదకాకానికి సీఎం చంద్రబాబు

- శంకరకంటి ఆస్పత్రిలో ఐ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



సీఎం ప్రారంభించనున్న ఐ హాస్పటల్

పెదకాకాని, గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం రానున్నారు. ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన దుర్గం నాగమనోహర్ బ్లాక్ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ విభాగాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ శ్రీవాత్సవ పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని, సభా వేదిక ప్రాంగణాన్ని, ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణకాంత్, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ మల్లకంబ్ పోటీలు

● జాతీయ స్థాయి పోటీలకు 20 మంది ఎంపిక



విద్యార్థులతో స్కూల్ గేమ్ ఫెడరేషన్ సభ్యులు తదితరుల

గుంటూరు(విద్య),నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ మల్లకంబ్(పోల్‌కు తాడుకట్టి విన్యాసాలు చేసే క్రీడ) పోటీలు శనివారం ముగిశాయి. పెదకాకాని మండలం వెనిగండ్ల జడ్పీ స్కూల్‌లో 7, 8 తేదీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా హాజరైన పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక అధికారి శేఖర్‌రాజు మాట్లాడుతూ పోటీలకు పది జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. నలుగురు సభ్యులతో సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేసి వివిధ విభాగాల్లో టోర్నమెంట్ నిర్వహించి 20 మంది క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశామని వివరించారు. పోటీలను డీఈఓ సీవీ రేణుక పర్యవేక్షించారు. విద్యార్థులకు ప్రత్యేక వసతులు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గోపి, శిరీష, సీనియర్ ఉపాధ్యాయులు కొండయ్య, లక్ష్మీపతి, మాధవి పాల్గొన్నారు.

19 నుంచి వీరారాధన ఉత్సవాలు

కారంపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో ఈ నెల 19 నుంచి ఐదు రోజులపాటు వీరారాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వీరాచారం పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు తెలిపారు. శనివారం కారంపూడిలో ఆయన మాట్లాడుతూ 19న రాచగావు, 20న రాయబారం, 21న మందపోరు, 22న కోడిపోరు, 23న కల్లిపాడు పేరుతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆయన వెంట పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ ఉన్నారు.

కంచి కామకోటి పీఠాధిపతికి ఘనస్వాగతం



కుంకుమ దిద్దుకుంటున్న స్వామి

కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతికి శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి భక్తులు ఘన స్వాగతం పలికారు. శనివారం బాపట్ల నుంచి తెనాలిలోని ఓ కార్యక్రమానికి కొల్లూరు మీదుగా వెళుతున్న స్వామికి.. పార్వతి అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగత ఏర్పాట్లు చేశారు. స్వామిని ఆలయంలోకి ఆహ్వానించగా సమయభావం వల్ల రాలేనని ఆయన చెప్పడంతో.. కమిటీ సభ్యులు అమ్మవారి కుంకుమ ఇచ్చారు. నుదిటికి ఆ కుంకుమను దిద్దుకుని భక్తులను, కమిటీ సభ్యులను శంకర విజయేంద్ర సరస్వతి ఆశీర్వదించారు.

తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులో గుర్తుతెలియని మృతదేహం



జెండా చెట్టు వద్ద మృతదేహం

తెనాలి క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులోని జెండా చెట్టు సమీపంలో శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 30-35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి సమాచారం లభించకపోవడంతో.. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సాంకేతికతతో పాటు నైతిక విలువలు అత్యవసం

● సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్



మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్

గుంటూరు(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యాయ, పరిపాలన వ్యవస్థలు ప్రజల అంచనాలకు తగిన విధంగా పని చేయాలంటే సాంకేతికతతో పాటు నైతికత, మానవత్వం కూడా అంతే అవసరమని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలోని కృత్రిమ మేధస్సు సాంకేతిక యుగంలో న్యాయ సహాయం, న్యాయం అందుబాటులోకి తేవడం.. అనే అంశంపై శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏఐ, టెక్నాలజీ న్యాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నప్పటికీ, అవి ఎప్పటికీ న్యాయవాదులు, న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలు పరిశోధన, డ్రాఫ్టింగ్, పరిపాలనలో సహకరించినా.. న్యాయ సారం మాత్రం మానవ ఆలోచన, విశ్లేషణ, దయ, నైతిక తీర్పులోనే ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గా ప్రసాద్‌రావు మాట్లాడుతూ టెక్నాలజీ శక్తివంతమైన సాధనం అయితే.. దాని విలువ మానవసేవలోనే ఉందన్నారు. భారత న్యాయ వ్యవస్థ వేగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ వర్శిటీ వీసీ ఆచార్య నాగభూషణ్, విజ్ఞాన్ విద్యాసంస్థలు చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతో సమానంగా అక్వా కల్చర్

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



నదిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

విజయపురిసౌత్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో వ్యవసాయంతో సమానంగా ఫిష్ అండ్ అక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో 6.24 లక్షల చేప పిల్లలను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకార సంక్షేమాన్ని గాలికి వదిలేసి దాదాపు 11 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో వేట నిషేధం సమయంలో అందిస్తున్న రూ.10 వేల సాయాన్ని రూ. 20 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆక్వా రంగాన్ని ప్రోత్సహించేందుకు విద్యుత్ యూనిట్ ధర రూ. 2.50 నుంచి రూ. 1.50కు తగ్గించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, గురజాల ఆర్డీవో మురళికృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, టీడీపీ యువ నేత జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్లయ్య, చిరంజీవిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా యువ ఆపద మిత్ర పథకం అమలు

● ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్



తాడేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యువ ఆపద మిత్ర పథకం ప్రారంభించిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా ఒడిశా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఐదు రాష్ట్రాలకు చెందిన వలంటీర్లకు ఈ పథకం ద్వారా శిక్షకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఏపీలోని అన్ని జిల్లాల నుంచి 52 మంది వలంటీర్లు 21 రోజులపాటు శిక్షణ పొంది వచ్చారన్నారు. వారిని అభినందిస్తూ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రఖర్ జైన్ మాట్లాడుతూ శిక్షణ పొందిన ఆపద మిత్ర సేవకులు రాష్ట్రంలోని ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, నెహ్రూ యువకేంద్రం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి యువజన సంఘాలకు చెందిన 12,360 మందికి, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, అగ్నిమాపక ట్రైనింగ్ సిబ్బందితో కలిసి శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. విపత్తులు సంభవించినప్పుడు భద్రతా దళాలకు అండగా ఉండడం, ప్రజలను రక్షించడం, సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించడం, ప్రథమ చికిత్సలు అందించడం.. ప్రమాద నష్టం తగ్గింపులో స్వచ్ఛంద సేవా సంస్కృతిని పెంపొందించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఆపద సమయాల్లో ఉపయోగపడే అత్యవసర కిట్, ధృవపత్రం, గుర్తింపు కార్డులు, విపత్తుల పట్ల అవగాహన పోస్టర్లు ప్రఖర్ జైన్ అందజేశారు. ఈ సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఏట హనుమంతరావు, ఎస్‌ఈఓసీ ఇన్‌చార్జి పీటర్, వలంటీర్లు పాల్గొన్నారు.

దిండి సముద్ర మార్గంలో 28 ఆవులు మృతి



తీర ప్రాంతంలో చనిపోయిన ఆవు

నిజాంపట్నం(రేపల్లె), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో సముద్రం ఒడ్డున 28 ఆవులు మృతి చెందాయని.. దానికి కారణం తెలియడం లేదంటూ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నిజాంపట్నం మండలం దిండి సముద్రం ఒడ్డున పల్లపట్ల, దిండికి చెందిన రైతుల ఆవులు మృతిచెందాయి. దిండి సమీపంలో హేచరీల నుంచి వచ్చే వ్యర్థాలు కలుషితమైన నీటిని తాగి ఆవులు చనిపోయాయని కొందరు, మడ ఆకులు తిని చనిపోయాయని మరికొందరు భిన్న వాదనలు వినిపిస్తున్నారు. సమీపంలోని పశు వైద్యులు ఆవులను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఒక ఆవును తీసుకువచ్చారు. గుంటూరు జిల్లా గోశాల నుంచి కొంతమంది సభ్యులు వచ్చి ఆవుల మృతిపట్ల విచారణ చేశారు. అయితే రైతులు ఫిర్యాదు ఇవ్వలేదని కేసు నమోదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.

మోటారు సైకిల్‌ని ఢీకొట్టిన లారీ..ఒకరు మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

నరసరావుపేట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామం వద్ద మోటారు సైకిల్‌ను లారీ ఢీకొట్టింది. శనివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ ఫాతిమా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాచవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపతిరావు వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గంగిరెడ్డిపాలెం సమీపంలో ఆటో, ఎద్దుల అరక ఢీకొన్న ఘటనలో జానపాడు గ్రామానికి చెందిన గుడిపూడి కోటేశ్వరరావు(52)కు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం అతను మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారుడు లక్ష్మీ కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అమరేశ్వరుని సన్నిధిలో..
హైకోర్టు జడ్జి సుబ్బారెడ్డి దంపతులు



న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రేఖ

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దంపతులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారి పేరున స్వామివార్లకు పూజలు నిర్వహించి, ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఐటీ అధికారి పేరుతో బెదిరింపులు

● 8 పోలీస్‌స్టేషన్లలో కేసులు ● చిలకలూరిపేటలో అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ పి.రమేష్

చిలకలూరిపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను శాఖ అధికారిని అంటూ వ్యాపారులను బెదిరించి డబ్బు కాజేస్తున్న గుంటూరు ఆర్టీసీ కాలనీకి ఓ వ్యక్తిని చిలకలూరిపేట అర్బన్ పోలీసులు శనివారం ఇక్కడ అరెస్టు చేశారు. అర్బన్ సీఐ పి.రమేష్ వివరాల మేరకు.. చదలవాడ తిరుమలరెడ్డి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారుల వివరాలు సేకరించాడు. ఆదాయ పన్ను దాడులు చేస్తామని, లెక్కల్లో ఏమాత్రం తేడా ఉన్నా పెనాల్టీలు వేస్తామని, ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని వారికి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు. డబ్బులు ఇస్తే ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇస్తున్నాడు. ఇతడి ఆగడాలకు సంబంధించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిఘా పెట్టారు. అతడిని అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై 8 పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నాయని పోలీసులు తెలిపారు. మండలంలోని పసుమర్రు గ్రామంలో ఓ పొగాకు కంపెనీ యజమానిని కూడా నిందితుడు బెదిరించి రూ. 15 వేలు వసూలు చేశాడని పోలీసులు తెలిపారు.

సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి
● ఘనంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థిని షేక్.ముబీనాకు పట్టా అందజేస్తున్న డాక్టర్ కె.మధుమూర్తి, శ్రీనివాసరావు

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో రాణించాలంటే సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి పేర్కొన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల 12వ స్నాతకోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ మధుమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి.. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులతో కలిసి జెన్ టెక్నాలజీ రీసెర్చ్ బ్లాక్‌ను ప్రారంభించారు. తదుపరి డిగ్రీ పొందిన 650మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కొత్తవి నేర్చుకోవాలనే తపన, నిరంతర శ్రమ ఉన్నప్పుడే ఆయా రంగాల్లో అనుకున్న ప్రగతిని తప్పక సాధిస్తారన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల పురోభివృద్ధికి బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ విద్యా రంగంలో రాణిస్తూ మంచి పేరు సాధించాలని ఆకాంక్షించారు. స్వర్గీయ ముప్పలనేని శేషగిరిరావు ఆలోచనాత్మక శక్తిని, దూరదృష్టిని కొనియాడారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాల సాధన దిశగా కృషి చేస్తూ.. ఉన్నతమైన ప్రమాణాలతో సాంకేతిక విద్యనందిస్తున్నామన్నారు. ముప్పలనేని శేషగిరిరావు మహోన్నతమైన సేవలను గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథి డాక్టర్ కె.మధుమూర్తిని ఎడ్యుకేషన్ సొసైటీ పాలక మండలి ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కారుమంచి వెంకట్రావు, పారెపల్లి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ దొడ్డపనేని వెంకయ్యచౌదరి, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, కో-ఆర్డినేటర్ డాక్టర్ షేక్.నజీర్, ఆంగ్ల విభాగ అధ్యక్షులు డాక్టర్ పీవీ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఎం.వీరయ్య, డాక్టర్ షేక్.షబ్రీన్‌సుల్తానా, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను సీఎస్‌ఈ విద్యార్థి సి.హెచ్.పుణ్యవతికి, సిల్వర్ మెడల్‌ను ట్రిపుల్‌ఈ విద్యార్థిని కె.లలిత సత్య శ్రీమల్లికకు, బ్రాంజ్ మెడల్ మెకానికల్ విద్యార్థి ఎన్.రామ్‌కుమార్‌కు ప్రదానం చేశారు. డిగ్రీలు సాధించిన విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఆయువు తీరినా.. మమకారం మరువక..



ఆవు కళేబరానికి మేళతాళాలతో అంతిమయాత్ర

కొల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్ల ఎంతో ప్రేమగా చూసుకున్న ఆవు అనారోగ్యంతో మృతి చెందడంతో.. కళేబరానికి అంతిసంస్కారాలు నిర్వహించి తన మమకారాన్ని చాటుకున్నాడు ఈ యజమాని. మండలంలోని పోతార్లంక గ్రామానికి చెందిన ఈడ్పుగంటి కుటుంబరావు పోషణలోని ఆవు 20 ఏళ్లలో.. పది సార్లు లేగ, పెయ్య దూడలు అందించింది. ఇటీవల ఆవు అనారోగ్యానికి గురికాగా.. పశు వైద్యులు వైద్య సేవలు అందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. శనివారం ఆవు కళేబరానికి పసుపు, కుంకుమ, పూలతో పూజలు నిర్వహించి.. ఎడ్ల బండిపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో అంతిమ యాత్ర చేశారు. తమ సొంత స్థలంలో కళేబరాన్ని ఖననం చేశారు.

కేంద్ర బృందం పర్యటనకు అధికారులంతా సిద్ధంగా ఉండాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బృందం ఈనెల 10న జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ విషయమై శనివారం కలెక్టరేట్ నుంచి ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ రోడ్డులు, కల్వర్టులు, డ్రైనేజీలు, కాల్వల నష్టాల అంచనాపై కేంద్ర బృందం పర్యటించటం జరుగుతుందన్నారు. ముందుగా కలెక్టరేట్‌కు చేరుకొని జరిగిన నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించటం జరుగుతుందన్నారు. అనంతరం ఫీల్డ్ విజిట్ చేస్తారన్నారు. శాఖల వారీగా జరిగిన నష్టంపై రిపోర్ట్‌ను జాయింట్ కలెక్టర్‌కు అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జలవనరుల శాఖకు సంబంధించి మూడు డివిజన్‌ల పరిధిలో ఎంత నష్టం జరిగిందని, దానికి ఎంత ఖర్చు అవుతుందన్న వివరాలను తెలియజేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, గృహనిర్మాణ సంస్థ, విద్యుత్, ఇతర శాఖలకు సంబంధించి ఎంత నష్టం జరిగింది, దానికి ఎంత ఖర్చు అవుతుందన్న పూర్తి వివరాలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతూ ఫ్లెక్సీ



కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సేవలను అభినందిస్తూ నల్లమోతువారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కర్లపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒక ప్రభుత్వాధికారి ప్రజల కోసం పనిచేస్తే ఎలా ఉంటుందో చూపిస్తున్న.....అంటూ కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు పాదాభినందనం చేస్తూ కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. రాజకీయ నాయకులకు, సినిమా హీరోలకు ఫ్యాన్స్ కటౌట్‌లు కడుతుంటారు. కాని ఇక్కడ ఏకంగా కలెక్టర్‌నే అభినందిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆయన మొంథా తుఫాన్ సమయంలో చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు ఫ్లెక్సీలో ఉంచారు. దీంతో సిటిజన్‌లు కటౌట్ చూసి కొన్ని కొన్ని నమ్మేయాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ కలెక్టర్‌ను అభినందిస్తున్నారు.

దివ్యాంగుల సమస్యలు ముఖ్యమంత్రికి వివరించిన గోగన



ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న గోగన ఆదిశేషు, కోకి రాజశేఖర్, షేక్ సుభానీ

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కేంద్ర పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ద్వారా సమస్యలు వివరించారు. దివ్యాంగుల కుటుంబాలకు 300యూనిట్‌ల వరకు ఉచిత కరెంట్ ఇవ్వాలని, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఉద్యోగవకాశాలు కల్పించాలని కోరారు. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలన్నారు ఇళ్ళ స్థలాలిచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. 5 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ ప్రకటించాలన్నారు. దివ్యాంగులను పెళ్ళి చేసుకునే సకలాంగులకు రూ.2 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన దివ్యాంగుల నాయకులు కోకి రాజశేఖర్, షేక్ సుభానీ ఉన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ సీనియర్ సహాయకుడు నాగుల శ్రీనివాసరావు, ఆలయసిబ్బంది పర్యవేక్షించారు.

శ్రీలింగోద్భవస్వామివారి దేవస్థానంలో....



శ్రీ లింగోద్భవస్వామి

మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో కార్తికమాసం సందర్భంగా శనివారం ఆలయానికి భక్తులు, మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజులు నిర్వహించారు.



స్విమ్మర్లకు యూనిఫామ్‌లు అందజేస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తదితరులు

స్విమ్మర్లకు యూనిఫామ్‌లు పంపిణి

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో గస్తీ తిరుగుతున్న 15 మంది స్విమ్మర్లకు శనివారం యూనిఫామ్‌లు, పండ్లు పంపిణి చేశారు. రూరల్ సీఐ శ్రీనివాస్, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, మత్స్యశాఖ ఏడీ సైదానాయక్, ఎఫ్‌డీవో రవీంద్ర, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ పాల్గొని వాటిని అందజేశారు. యూనిఫామ్‌లు అందజేసిన బొనిగల రాజేంద్ర బృందాన్ని పలువురు అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నాయకులు

ప్రజా ఉద్యమానికి తరలిరావాలి

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో మొదలు పెట్టిన ప్రజా ఉద్యమానికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపునిచ్చారు. ఈనెల 12వ తేదీన చేపట్టే ప్రజా ఉద్యమం పోస్టర్‌లను శనివారం వైసీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్మించాలని అప్పుడే పేద ప్రజలకు విద్య, వైద్యం అందించగలరని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ చినపోతుల హరిబాబు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎం.ఏడుకొండలురెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నక్కా వీరారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా, అవినాష్‌నాయుడు, జీకే నాయుడు, సముద్రాలుగౌడ్, పీటా వేణు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలుదుకాణాలలో ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించి సంతకాలు సేకరించారు.

కనకదాసు చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి

● అధికారులకు సూచించిన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



శ్రీభక్తకనకదాసు పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తదితరులు

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు శ్రీభక్త కనకదాసు చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శ్రీభక్త కనకదాసు జయంతిని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో కనకదాసు జయంతిని గొప్పగా నిర్వహించుకుంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కనకదాసు జయంతిని అన్ని జిల్లాలలో నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కనకదాసు శ్రీకృష్ణునికి గొప్ప భక్తుడన్నారు. కనకదాసు ఒక పల్లె నుంచి మరోపల్లెకు వెళుతూ దాసులు సాహిత్యకీర్తనలు పాడుతూ గ్రామాలలోని ప్రజలకు సమాజం గురించి అవగాహన కల్పిస్తూ వారిలో జ్ఞానాన్ని పెంచేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, బీసీ సంక్షేమశాఖాధికారి శివలీల, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, కురుప సంఘం సెక్రటరి మర్రి నాగేశు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తత్వజ్ఞానాన్ని సామాన్యులకు అందించిన భక్త కనకదాసు

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తత్వ జ్ఞానాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా సంగీతం, సాహిత్యంతో అందించేందుకు తన జీవితాన్ని శ్రీభక్త కనకదాసు అంకితం చేశారని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం భక్త కనకదాసు జయంతిని నిర్వహించారు. పోలీసు అధికారులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఆయన మహత్తరమైన కవి, భక్తుడు, తత్వవేత్త మాత్రమే కాకుండా సమాజంలో సమానత్వం, సత్యం, ధర్మం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. పోలీసు శాఖ కూడా భక్త కనకదాసు బోధనలను మార్గదర్శకంగా తీసుకొని విధులకు కట్టుబడి సమాజ సేవలో మరింత కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్.అహ్మద్ జానీ, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కనకదాసు పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్, పోలీసు అధికారులు

విద్యార్థులు సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలి

● రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ డాక్టర్ మధుమూర్తి

● బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా 12వ స్నాతకోత్సవం



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో అత్యాధునిక ప్రయోగశాలను ప్రారంభిస్తున్న డాక్టర్ కె.మధుమూర్తి, ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక రంగంలో రాణించాలంటే సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలని ఆధునిక విజ్ఞానంపై మంచి అవగాహన కలిగిఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి అన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల 12వ స్నాతకోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ మధుమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులతో కలిసి ముందుగా జెన్ టెక్నాలజీ రీసెర్చ్‌బ్లాక్ భవనం ప్రారంభించారు. తదుపరి డిగ్రీ పొందిన విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత అధునాతన ఇంజనీరింగ్ విభాగాలైన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మిషన్‌లెర్నింగ్, డేటా సైన్స్ వంటి రంగాలలో మెరుగైన ఉద్యోగవకాశాలు ఉన్నాయని తెలిపారు. దివంగత ముప్పలనేని శేషగిరిరావు ఆలోచనాత్మక శక్తిని, దూరదృష్టిని కొనియాడారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలు సాధించేందుకు కృషి చేస్తూ ఉన్నతమైన ప్రమాణాలతో సాంకేతిక విద్యనందిస్తున్నామన్నారు. ముప్పలనేని శేషగిరిరావు మహోన్నతమైన సేవలను గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి మాట్లాడుతూ కళాశాల ప్రగతికి అధ్యాపక బృందం అంకితభావంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం వివిధ విభాగాలలో చదువు ముగించుకొని వెళుతున్న 650మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించినందుకు తమకెంతో సంతోషంగా, గర్వంగా ఉందని పలువురు విద్యార్థులు అన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు పట్టాలు తీసుకున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథి డాక్టర్ కె.మధుమూర్తిని ఎడ్యుకేషన్ సొసైటీ పాలకమండలి ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కారుమంచి వెంకట్రావు, పారెపల్లి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి దొడ్డపనేని వెంకయ్యచౌదరి, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, కోఆర్డినేటర్ డాక్టర్ షేక్ నజీర్, ఆంగ్ల విభాగ అధ్యక్షులు డాక్టర్ వీవీ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఎం.వీరయ్య, డాక్టర్ షేక్ షబ్రీన్‌సుల్తానా, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులు

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులలో గోల్డ్‌మెడల్ సాధించిన వారికి మెడల్స్ అందజేశారు. డాక్టర్ కృష్ణ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను సీఎస్ఈ విద్యార్థిని సీహెచ్ పుణ్యవతికి, సిల్వర్ మెడల్‌ను ఇఇఇ విద్యార్థిని కె.లలిత సత్య శ్రీమల్లికకు, బ్రాంజిమెడల్ మెకానికల్ విద్యార్థి ఎన్.రామ్‌కుమార్‌కు అందజేశారు.



మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో శనివారం జరిగిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కుమారుడు రాకేష్‌వర్మ వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. వధూవరులు రాకేష్, రూపానాగదేవికలను చంద్రబాబు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉమ్మడి జిల్లా బాలబాలికల హాకీ జట్ల ఎంపిక

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-17 బాలబాలికల హాకీ జట్ల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలలో ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బోయన వీరచంద్ర, హాకీ కోచ్ వెంకట్ తదితరులు పాల్గొని జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాహనాలను నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంతో డ్రైవింగ్ చేయరాదని పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో రహదారి భద్రతపై శనివారం రాత్రి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోడ్రైవర్‌లు, పోలీసుసిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపకూడదని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్‌లు పాల్గొన్నారు.

జిల్లా స్కిల్ పోటీల్లో ప్రథమస్థానంలో యడ్లపల్లి విద్యార్థులు

చుండూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో జరిగిన పాఠశాల జిల్లా స్థాయి స్కిల్ పోటీలలో యడ్లపల్లి శ్రీఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని హెచ్‌ఎం కుర్రా శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో షేక్ అశ్వన్, కె.రిషి, ఇంటర్ మొదట సంవత్సరం విభాగంలో కె.దుర్గాభవానీ, నాగదుర్గ, టీం యాంటి స్లీప్ అలారమ్ ఫేర్ డ్రైవర్స్ అనే మోడల్ ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించింది. వీరికి శిక్షణ ఇచ్చిన ట్రైనర్ విప్పల త్రివేణి, అగ్రికల్చర్ ట్రైనర్ పి.జాన్‌వెస్లీ, ఆటోమోటివ్ ట్రేడ్ ట్రైనర్ తిరుపతిరావు, పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలపడంలో కృషి చేసినందుకు హెచ్‌ఎం శ్రీనివాసరావు, రావి సాయిబాబా, ఎస్ఎంసీ ఛైర్మన్ బయ్యా సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తిక మాసంలో పూజలలో పాల్గొనడం ద్వారా నియమనిష్టలు, మంచి నడవడిక ఏర్పడతాయని విద్యాజానపద శర్మ తెలిపారు. నగరం మండలం కారంకివారిపాలెం పంచాయతీ ధూళిపూడిశివారు షైనేనివారిపాలెం గ్రామంలో 12అడుగుల ఏకశిలా అభయాంజనేయస్వామికి శనివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచారపు రాజేష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాడి పరిశ్రమతో ఆర్థిక పరిపుష్టి

● పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుధాకరరావు



పాడి రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేస్తున్న డీడీ సుధాకరరావు

వేమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి పొందవచ్చునని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుధాకరరావు సూచించారు. మండలంలోని పోతుమర్రు గ్రామంలో శనివారం పాడి పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుధాకరరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గోకులం పథకం ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు మాట్లాడుతూ, మేలుజాతి పశు సంపద అభివృద్ధికి పెయ్యి దూడలు పుట్టే లింగ నిర్ధారణ వీర్యాన్ని ప్రభుత్వం రూ.500 నుంచి రూ.150 ధరను తగ్గించడం జరిగిందన్నారు. వైద్య శిబిరంలో 70 పశువులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ గణపతినాయక్, పశు వైద్య సహాయకులు ఎ.సందీప్‌సాయి, ఎ.మాధవి ప్రసాద్, టి.మధుబాబు పాల్గొన్నారు.

వైద్యాన్ని ప్రైవేటీకరణ చేయటం విరమించుకోవాలి

రేపల్లె, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : వైద్యాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రభుత్వ నిర్ణయం విరమించుకోవాలని సీపీఎం(ఎల్)నాయకురాలు ఎం.శోభారాణి అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్, జైభీమ్, కాంగ్రెస్ పార్టీలు శనివారం ధర్నా నిర్వహించారు. ప్రజాసంఘాలనాయకులు సీహెచ్ మణిలాల్, రమేష్, దోవా రమేష్‌రాంజీ, యడ్లపల్లి కిషోర్, ఆశీర్వాదం, కె.వెంకట్రావు, బాబూరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

చెరుకుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో రెండురోజులుగా జరుగుతున్న టీచ్‌టాప్ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమానికి చుండూరు, వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చెరుకుపల్లి మండలాల నుంచి 59 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లాకోఆర్డినేటర్ అబ్రహంలింకన్, కోఆర్డినేటర్లుగా పి.లాజరు, టి.నవీన్‌కుమార్, కె.శికుమార్(ఏసిజీతు),ఎండీ అక్రమ్‌ఘోరీ, ఆర్.శ్రీధర్, ఆనంద్, రాజారావు, శ్రీనివాసరావు, బాలసుందరం పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

● లబ్ధిదారులకు రూ.5,75,395 విలువైన చెక్కులు పంపిణీ

కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందారు. తమ ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించి సాయం అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి రిఫర్ చేశారు. అక్కడ నుంచి విడుదలైన చెక్కులను కొల్లూరుకు చెందిన వల్లేపల్లి సదాశివకోటేశ్వరరావు రూ.2,91,520, మైనేని వెంకటేశ్వరరావు రూ.1,20,904, గోగినేని భానుమతి రూ.40,580, కత్తి వెంకటేశ్వరమ్మ రూ.20 వేలు, చుక్కపల్లి వెంకటేశ్వరరావు రూ.15,413, జువ్వలపాలెం గ్రామానికి చెందిన భూపతి బుజ్జి రూ.37,878, భూపతి వెంకటేశ్వరరావు రూ.21,986, గాజుల్లంక గ్రామానికి చెందిన జాలాది ప్రశాంతికి రూ.27,114 చెక్కులు రాగా వాటిని ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి

● అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దైవచింతనతో ముందుకు వెళ్ళితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఇసుకపల్లిలోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మహిళా తల్లులచే సుమంగళి పూజా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 150 మంది మహిళలచే సుమంగళిపూజా లలితాసహస్ర పారాయణం, శ్రీసుక్తపఠనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను కొమ్మూరు కృష్ణప్రసాద్, పవన్‌కుమార్ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యనిర్వహణాధికారి దివి వెంకటఅప్పలాచార్యులు ఏర్పాట్లు చేశారు. అనంతరం శివప్రసాద్‌ను పట్టువస్త్రాలతో సన్మానించారు.



కార్యక్రమంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

ఇసుక ట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లు

కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల నుంచి కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. మండల పరిధిలోని చింతల్లంక గ్రామం పరిధిలో కృష్ణానదిలో ట్రాక్టర్ల యజమానులు ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తూ రవాణా చేస్తున్నారు. దీంతో గ్రామంలోని కొందరు చర్చి అభివృద్ధి పేరిట వారి నుంచి ట్రాక్టర్‌కు రూ.100 అక్రమంగా వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుక తవ్వకాలు చేయాల్సి ఉండగా కృష్ణానదిలో ఎక్కడబడితే అక్కడ ఇసుక తవ్వకాలు చేయడం, దీనిని ఆసరాగా తీసుకుని గ్రామంలోని కొందరు అభివృద్ధి పేరుతో అక్రమ వసూలుకు పాల్పడుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లుగా చోద్యం చూస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలు, వసూళ్లపై దృష్టి సారించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రౌడీషీటర్లు మంచి ప్రవర్తన కలిగి ఉండాలి : డీఎస్పీ

అమృతలూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 8 : రౌడీషీటర్లుగా ఉన్న వారు సరైన నడవడిక లేకపోతే కఠిన చర్యలు తప్పవని రేపల్లె డీఎస్పీ ఏ శ్రీనివాసరావు హెచ్చరించారు. అమృతలూరు పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లుగా ఉన్న వారిని స్టేషన్‌కు పిలిపించారు. డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లపై 24 గంటలు నిఘా ఉంటుందన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, అలా లేని పక్షంలో తగు చర్యలు తీసుకోబడతాయని చెప్పారు. ఆయన వెంట చుండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌ఎల్ఎన్ శ్రీనివాసరావు, ఎస్ఐ రవితేజ తదితరులు ఉన్నారు.



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న బుచ్చిరాంప్రసాద్

పదవీ బాధ్యతలు స్వీకరించిన దుర్గా ప్రసాద్

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా చివుకుల దుర్గా ప్రసాద్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కి, యువ నాయకుడు లోకేశ్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా న్యాయం చేస్తామని దుర్గాప్రసాద్ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చెరుకుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంబొట్లపాలెంలోని శ్రీవాసిరెడ్డిసుబ్బారావు హాస్పటల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ వాసిరెడ్డి విశ్వక్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఏరియా వైద్యశాలలోని నవజ్యోతి శిశువుల స్థిరీకరణ యూనిట్

చేరువలో చిన్నారులకు చికిత్స

- ఏరియా వైద్యశాలలో అత్యాధునికి వైద్య సేవలు
- నవజాత శిశులపై వైద్య సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ
- మధ్యతరగతి, పేద తల్లిదండ్రులకు వరం..

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చిన్నారులకు చక్కటి వైద్యాన్ని వైద్యులు, సిబ్బంది అందిస్తున్నారు. పుట్టిన పిల్లల దగ్గర నుంచి ప్రతి ఒక్కరికీ ఇక్కడే నాణ్యమైన వైద్య సేవలందిస్తూ.. ప్రజల మన్ననలు పొందుతున్నారు. పిల్లలు అనారోగ్యానికి గురైతే.. తల్లిదండ్రుల ఆందోళన అంతాఇంతా కాదు. దీనిని ప్రైవేట్ హాస్పిటల్స్ ఆసరా చేసుకొని వేలాది రూపాయలు వారి నుంచి వసూలు చేస్తాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఇలా ఆర్థికంగా చితికిపోకుండా.. చిన్నా రులకు మెరుగైన వైద్య సేవలను ఏరియా వైద్య శాలలోనే ప్రభుత్వం అందిస్తోంది. చిన్నా రుల వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది నిత్యం అందు బాటులో ఉంటున్నారు. వైద్యశాలలోని నవజాత శిశువుల యూనిట్‌లో అవసరమైన పరికరాలను సమకూర్చారు. అప్పుడే పుట్టిన పిల్లలకు పచ్చకా మెర్లు, బరువు తక్కువ, ఉమ్మ నీరు ఇలా.. తీవ్ర అనారోగ్య సమస్యలకు నవజాత శిశువుల స్థిరీ కరణ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నారు. జ్వరం వచ్చినా, ప్లేట్‌లెట్స్ తగ్గినా ఇక్కడే అధు నాతన వైద్యం అందజేస్తున్నారు. 24 గంటలు వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణ ఉంటోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 953 మంది చిన్నారులకు వివిధ రకాల వైద్య సేవలను అందించారు.

ఆస్పత్రిలో ఆధునిక పరికరాలు



చిన్నారుల వైద్య సేవలకు హాస్పిటల్‌లో ఆధునిక పరికరాలున్నాయి. ఇద్దరు వైద్యులతో ఇక్కడ సేవలు అందిస్తున్నాం. అప్పుడే పుట్టిన చిన్నారులకు ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసు కోవాలి. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆస్పత్రికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం ద్వారా సమకూర్చుతున్నారు.

-డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

అద్వితీయం.. అబ్బురం

- కోలాహలంగా వీవీఐటీయూ బాలోత్సవ్
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు




పెదకాకాని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలల పండుగ అద్వితీయంగా సాగుతోంది. చిన్నారుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు అబ్బురపరుస్తూ.. విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆనందోత్సాహాల నడుమ వీవీఐటీయూ బాలోత్సవ్ 2025 వేడుకలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణం విద్యార్థుల కేరింతలతో సందడిగా మారింది. సెలవుదినం కావడంతో.. సందర్శకుల తాకిడి బాలోత్సవ్ ప్రాంగణంలో పెరిగింది. 280 పాఠశాలల నుంచి 4 వేల మంది విద్యార్థులు సబ్ జూనియర్స్ విభాగంలో వివిధ పోటీల్లో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నా టికలు, సంగీతం తదితర అంశాల్లో వారి ప్రద ర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నృత్యాలు వేదికల వద్ద ప్రే క్షకుల కరతాళ ధ్వని.. మిన్నం టంది. 54 నాటిక లు చిన్నారులకు సమాజం పట్ల ఉన్న దృక్పథా న్ని, సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని సృజనాత్మకతను బయటకు తీశాయి. న్యాయ నిర్ణేతలు విద్యార్థులు ప్రత్యేక బోధనలు చేశారు. పోటీల అనంతరం గజల్ శ్రీనివాస్ నిర్వహించిన సంగీత కచేరి చిన్నారులను అలరించింది.



బాలోత్సవంలో బహుమతి ప్రదానం చేస్తున్న గజల్ శ్రీనివాస్ తదితరులు



మిర్చియార్డు కింగ్ 341





- క్వింటాల్‌కు రూ. 17 వేల ధర
- కర్ణాటక రకం 2043 అయితే రూ. 20 వేలు
- పెరగని 'తేజ'స్సు

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మిర్చి ధరలు ఘాటెక్కాయి. కారం తయారీకి వినియోగించే 341 వెరైటీ మిర్చికి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చి యార్డు)లో డిమాండ్ గణనీయంగా పెరిగింది. సీజన్‌లో ఈ రకం మిర్చి క్వింటాల్ ధర రూ.13 వేల మధ్యనే ఉండగా నేడు రూ. 17 వేలకు పెరిగింది. దేశీయంగా ఉన్న డిమాండ్ దృష్ట్యా ఈ వెరైటీకి రాబోయే రోజుల్లో మరింత ధర పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో రైతులు, స్టాకిస్టులు ఆచితూచి తమ వద్ద ఉన్న మిర్చి నిల్వలను యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. మరోవైపు కర్ణాటకలో మాత్రమే పండే 2043 రకానికి కూడా విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీనిని కూడా కారం తయారీకే వినియోగిస్తారు. ఈ రకం మిర్చిని ఆ రాష్ట్రానికి చెందిన రైతులు మిర్చి యార్డుకు తీసుకొస్తుండగా ఎగుమతిదా రులు పోటీపడి క్వింటాల్ రూ.19 వేల నుంచి రూ.20 వేలకు కొనుగోలు చేస్తోన్నారు.

341కు పెరిగిన డిమాండ్

ఇటీవల ముఖ్యంగా ఊరగాయ పచ్చళ్ల కోసం బాగా ఎరుపు రంగులో ఉండే 341 వెరైటీ మిర్చితో తయారు చేసిన కారాన్ని ఉత్పత్తిదా రులు వినియోగిస్తున్నారు. ఈ రకం కారంలో పెద్దగా ఘాటు ఉండదు. పచ్చళ్లు చాలా ఎర్రగా కనిపిస్తుంటాయి. అలానే ఈ వెరైటీ మిర్చి నుంచి ఎర్ర రంగు తీసి కొన్ని ఔషధాల్లో కూడా వినియోగిస్తుంటారు. దీంతో ప్రస్తుతం మిర్చి యార్డులో అన్‌సీజన్ అయినప్పటికీ 341 రకం మిర్చికి మంచి డిమాండ్ ఏర్పడింది. నిత్యం విక్రయం జరుగుతున్న 50 వేల మిర్చి టిక్కీలలో 20 నుంచి 22 శాతం వరకు ఈ వెరైటీ బస్తాలే ఉంటున్నాయి. ఇటీవల భయపెట్టిన మొంథా తుపాను వల్ల పంట దెబ్బతిందని, మార్కెట్‌కు రావడం ఆలస్యమవుతుందన్న ఊహాగానాలతో ఎగుమతి దారులు మిర్చి యార్డులో వివిధ రకాలు కొనుగోలు చేసి స్టాకు పెట్టుకొంటున్నారు.

పెరగని తేజస్సు..


గుంటూరు మిర్చి యార్డు ఘాటు వెరైటీలకు పెట్టింది పేరు. అందులో ముఖ్యమైన రకం తేజ. ఇది ఎక్కువగా చైనా, బంగ్లాదేశ్‌లకు ఎగుమతి అవుతుంటుంది. అయితే ప్రస్తుతం ఎగుమతులు అంత ఆశాజనకంగా లేకపోవడంతో తేజ వెరైటీ మిర్చి అంతంత మాత్రంగానే విక్రయం జరు గుతోంది. ఈ కారణంగా ధర క్వింటాల్ రూ. 14 వేల నుంచి రూ.15 వేల మధ్యనే కొనసాగుతోంది. ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ వస్తే తప్పా తేజ వెరైటీ ధర పెరగదని ఎగుమతిదారులు తెలిపారు. పైగా ఈ రకం స్టాకులే కోల్డ్ స్టోరేజ్‌లలో ఎక్కు వ శాతం ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం మాత్రం 341, 2043(కర్ణాటక), బ్యాడిగి వెరైటీల మిర్చి అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి.

తెనాలి, బాపట్ల మీదగా శబరిమల స్పెషల్స్

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం తెనాలి, బాపట్ల మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07109 కాకినాడటౌన్ - కొట్టాయం స్పెషల్ ఈ నెల 17, డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19 తేదీల్లో తెనాలి, బాపట్ల, చీరాల మీదగా ప్రయాణిస్తుంది. 07110 కొట్టాయం - కాకినాడటౌన్ స్పెషల్ ఈ నెల 18, డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమవుతుంది. రెండు రైళ్లు కలిపి మొత్తం 18 సర్వీసులు ఉంటాయి. వీటికి అడ్వాన్స్ బుకింగ్ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.

ప్రకాశం బ్యారేజీ దిగువకు 53,400 క్యూసెక్కులు


తాడేపల్లి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగ



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

లేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 60,946 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2311, పశ్చిమ డెల్టాకు 5009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

మూతపడిన సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు



విజయపురిసౌత్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో శనివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5297 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,323 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 51,323 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుత్ ప్రాజెక్టులో 0.7885 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.7885 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను మీటర్.. మరో 2 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 22,640, టేల్ రేస్‌ఛానల్ ద్వారా 8469 క్యూసెక్కులు మొత్తంగా 31109 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 34,226 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానం.

విశ్రాంతి లేకుండా తిప్పిస్తున్నారు..

- పీఎఫ్ ముగింపు సొమ్ము కోసం ఎదురు చూపులు
- విశ్రాంత ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- పది నెలలు గడుస్తున్నా లెక్క తేల్చని వైనం
- జడ్పీ సిబ్బంది అలసత్వం....లోపించిన అధికారుల పర్యవేక్షణ
- జనవరి 2022 పీఎఫ్ చందా మొత్తాలు ఎగవేసినట్లేనా?

గుంటూరు(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో పీఎఫ్ విభాగం సిబ్బంది అలసత్వం.. అధికారుల పర్యవేక్షణ లోపం ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. పీఎఫ్ సెక్షన్‌లో సిబ్బంది అలవిమాలిన నిర్లక్ష్యం విశ్రాంతి తీసుకోవాల్సిన వారిని.. కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగేలా చేస్తోంది. సంవత్సరం నుంచి పీఎఫ్ ముగింపు సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూడాల్సి వస్తోంది.

సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలో మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న 10 వేల మందికిపైగా ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పీఎఫ్ ఖాతాలను జడ్పీలోని పీఎఫ్ విభాగం సిబ్బంది నిర్వహిస్తారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాల్లో మినహాయించిన పీఎఫ్ చందాలను ట్రెజరీ శాఖ నుంచి వచ్చిన వివరాలతో సరి చూసుకొని వాటిని వారి వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలకు జమ చేస్తారు. అదేవిధంగా రుణాల మంజూరు, మరణించిన, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఖాతాలను వడ్డీతో ముగించి ఆ సొమ్మును ప్రతి నెలా సీఎఫ్ఎంఎస్ గేట్‌వే ద్వారా వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ మొత్తాలు 3 నుంచి 4 నెలల్లోపు విడుదల అవుతాయి. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి బిల్లులకు మోక్షం కలగడం లేదు.

- జడ్పీలో మండల పరిషత్ టీచర్లకు ఒక సెక్షన్, జిల్లా పరిషత్ టీచర్లకు, బోధనేతర సిబ్బం దికి మరొక సెక్షన్ ఉంటుంది. ప్రతి సెక్షన్‌లో ఒక ఏఓ, 10 మంది చొప్పున సిబ్బంది ఉంటారు.
- ప్రాథమిక పాఠశాల టీచర్ల సెక్షన్‌లో రిటైరయిన రెండు నెలలకే ముగింపులు పరిష్కరిస్తుంటే, జడ్పీ టీచర్ల పీఎఫ్ చూసే సెక్షన్‌లో విశ్రాంత టీచర్ల ముగింపు సొమ్మునకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రాసెస్ చేసి లోకల్ ఫండ్ (ఎల్ఎఫ్) ఆడిట్‌కు పంపేందుకు.. కనీసం 5 నెలలు పడుతుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న సిబ్బంది చేయి తడిపితేనే ఫైల్‌కు మోక్షం కలుగుతోందన్న విమర్శలున్నాయి. ఆ తరువాత కూడా ఫైల్ కదలడానికి నెల రోజులు పడుతుందని చెబుతున్నారు. మళ్లీ ఆ తర్వాత బిల్లులు చేయడానికి మరొక నెల పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.
- పదవీ విరమణ తర్వాత వచ్చే పీఎఫ్ నగదుతో ఇల్లు, పిల్లల వివాహాలు, వైద్య ఖర్చులకు ఉద్యోగులు ఉపయోగించుకుంటారు. పీఎఫ్ సొమ్ము సకాలంలో విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయులు తీవ్ర మనోదనకు గురిఅవుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని నరసరావుపేట, ఈపూరు, రొంపిచర్ల, నకరికల్లు మండలాల్లోని జడ్పీ టీచర్ల పీఎఫ్ ముగింపులు పది నెలలుగా పరిష్కరించే వారు కనిపించడం లేదు.
- జడ్పీలో బిల్లులు చేసే సిబ్బందికి ఇటీవల బది లీ చేపట్టారు దీంతో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల ముగింపు ఖాతాలు, లోన్లు ని లిచిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.
- పీఎఫ్ విభాగంలో పనిచేసే సిబ్బందికి నైపుణ్యం, ఓర్పు నేర్పు, సమర్థత ఉండటం లేదు. కేవలం గుంటూరులో నివాసం కోసం మాత్రమే వచ్చిన సిబ్బందిని ఈ సెక్షన్‌కు బదిలీ చేస్తున్నారని విమర్శలున్నాయి. వారిపై అధికారులకు అజమాయిషీ లేకపోవడం ఉపాధ్యాయులకు శాపంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి.
- పీఎఫ్ సమస్యలపై 20 రోజులుగా విడతల వారీగా జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈవోకు విన్నవించిన ఫలితం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.
- జనవరి 2022లో మినహాయించిన పీఎఫ్ చందాలు వివరాలు అక్టోబరు 2024లో జడ్పీకి పంపినా ఇంతవరకు ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలో నగదు జమ కాలేదు. జనవరి 2022 నుంచి ఇప్పటి వరకు మరణించిన, పదవీ విరమణ చేసిన 500 మందికిపైగా ఉన్న ఉద్యోగులకు (కనీసం ఒక్కొక్క జనవరి 2022 నుంచి చందా రూ. 10 వేలు) జమ చేయకుండానే ముగింపు చేసి సొమ్ములు చెల్లించడం దారుణమని ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని విశ్రాంత ఉద్యోగులకు జనవరి 2022 చందాతో కలిపి లెక్కగట్టి పీఎఫ్ ఖాతాలను ముగించారని, గుంటూరు జిల్లాలో జనవరి నెల పీఎఫ్ మినహాయింపుల వివరాలు రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సూర్యలంక తీరానికి అనుమతి

- 18 రోజుల తర్వాత పుణ్యస్నానాలు ఆచరించిన భక్తజనం
- పటిష్ట భద్రతా ఏర్పాట్లలో పోలీసులు

సూర్యలంక బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు, భక్తులు



బాపట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాపట్ల సూర్యలంక సుముద్ర తీరం ద్వారాలు శనివారం తెరుచుకున్నాయి. కార్తిక మాసంలో భక్తుల సముద్ర స్నానానికి ఆటంకం తొలగింది. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా సముద్రంలో ఏర్పడిన గుంతల దృష్ట్యా పర్యాటకులను తీరానికి రాకుండా అధికారులు నిషేధించారు. 18 రోజుల తర్వాత ఎట్టకేలకు గట్టి బందోబస్తు, భద్రతల మధ్య తీరానికి అనుమతిచ్చారు. కార్తిక మాసంలో భక్తులు పుణ్యస్నానాలు ఇన్ని రోజులుగా ఇక్కడ ఆచరించలేకపోయారు. అదేవిధంగా ఈ ఏడాది కార్తిక పౌర్ణమి స్నానాలు కూడా లేకుండాపోయాయి. పోలీసు భద్రత, గజఈతగాళ్ల గస్తీ, హెచ్చరికల మధ్య జాగ్రత్తగా సముద్ర స్నానాలు ఆచరించే ఏర్పాట్లు చేశారు. పరిధి దాటి తీరంలోకి వెళ్తే.. చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పోలీసులు సూర్యలంక తీరం వద్ద పర్యాటకులకు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఆదివారం భక్తుల తాకిడికి అధికంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 21వ తేదీతో కార్తిక మాసం ముగుస్తుంది. ఈ 12 రోజులు సూర్యలంకకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉండే అవకాశం కనిపిస్తుంది. గతంలో ప్రతిపౌర్ణమికి రెండు లక్షలు మంది భక్తులు తీరానికి వచ్చేవారు. ఈ నెల 5న ఆంక్షల మధ్య పౌర్ణమి స్నానాలు లేకుండాపోయాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఇప్పటికే తీరంలో తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, జల్లు స్నానం ఏర్పాట్లు వంటివి చేసి మండలపరిషత్, గ్రామ పంచాయతీ అధికారుల తోపాటు రూరల్ పోలీసులు, మెరైన్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



తీరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు



గజఈతగాళ్లకు సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు



కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు, సంఘాల నాయకులు

భక్తిభావాన్ని పెంపొందించిన కనకదాసు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక కవి,తత్వవేత్త కనకదాసు తన కీర్తనల ద్వారా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందింపజేశారని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కనకదాసు చిత్రపటానికి డీఆర్వోతో పాటు బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలజ్యోతి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావుతో పాటు ఆయాశాఖల సిబ్బంది, పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఎల్. నాగేశ్వరరావు, రాచూరి శ్రీనివాసరావు, లంబు రాజేంద్ర, బక్కా సాంబశివరావు, బోలే శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మెప్మా ఉద్యోగులకు సీఎంఎం బెదిరింపులు

● 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఎలా వెళ్లిదంటూ చిందులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలో చోటుచేసుకున్న అవినీతి బాగోతాలు, వాస్తవాలు వెలుగులోకి రావడంపై అధికారులు ఉలికిపాటుకు గురయ్యారు. గురువారం ఒంగోలులో జరిగిన మెప్మా ఎండీ తేజ్ భరత్ సమీక్ష సమావేశంలో పీడీ శ్రీహరి, ఒంగోలు సీఎంఎం సంతోష్‌లపై ఎంతః సీరియస్ కావడం, జరిగిన అంశాలపై ఒంగోలు సీఎంఎంకి అక్షింతలు వేయడంతో కలవరపడిన సీఎంఎం సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే అంశాలపై ఆరా తీయడంతోపాటు, సమావేశంలో పాల్గొన్న అధికారులను బెదిరించినట్లు సమాచారం. ప్రత్యేకించి సమావేశంలో జరిగిన వాస్తవాలను ఆంధ్రజ్యోతిలోనే ప్రచురించడం పట్ల పలువురిని బెదిరించడంతోపాటు, అసభ్య పదజాలంతో దూషించడం ఇప్పుడు మెప్మాలో చర్చనీయాంశమైంది. వార్త రాసిన వారికి, రాయించిన వారికి ఎక్కడ ఎలా? పెట్టాలో మాకు తెలుసు అంటూ నేరుగా బెదిరించడం పట్ల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మెప్మాలో జరుగుతున్న బోగస్ గ్రూప్‌ల వ్యవహారం, అధికారుల వసూళ్ల పర్వం, ఇతరత్రా అంశాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంపై అధికారులు మల్లాగుల్లాలు పడటంతోపాటు, సమాచారం బయటకు ఎలా వెళుతోంది? అనే అంశంపై పలువురు ఆర్పీలను, కార్యాలయ ఉద్యోగులను బెదిరించినట్లు సమాచారం.

స్కూటీని ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కళ్లగుంట శ్రీను

సింగరాయకొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కనుమళ్లలో జాతీయ రహదారిపై రన్ వే వద్ద అదే గ్రామానికి చెందిన కళ్లగుంట శ్రీను స్కూటీపై రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తూ కావలి వైపు నుంచి ఒంగోలు వెళుతున్న లారీ అదుపుతప్పి శనివారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ లారీ ముందు టైరు కింద పడింది. దీంతో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి ఓ ప్రైవేటు వైద్యశాలకు అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. బాధితుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో స్వగ్రామం కనమళ్లకు వచ్చారు. వ్యక్తిగత పనుల నిమిత్తం సింగరాయకొండకు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సింగరాయకొండ ఎస్సై వి.మహేంద్ర సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేడు మంత్రి గొట్టిపాటి జన్మదిన వేడుకలు

ముప్పవరం (పంగులూరు), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఉదయం 9 గంటలకు ముప్పవరంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజును పురస్కరించుకొని ముప్పవరం బీసీ వసతి గృహంలో బాలికలకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు కేక్ కట్ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా రావూరి రమేష్ విజ్ఞప్తి చేశారు.

జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ

● ఒకదాని వెనుక ఒకటి వస్తుండగా ఘటన

● క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్

● రెండు గంటలు కష్టపడి బయటకు తీసిన పోలీసులు



క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్

వేటపాలెం (చీరాల), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి, రెండు లారీలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. బాపట్ల నుంచి ఒంగోలు వైపు ఒకదాని వెనుక ఒకటి రెండు లారీలు వడ్లలోడుతో వస్తున్నాయి. వేటపాలెంలోని టపాసుల గోడౌన్ వద్దకు రాగానే, ముందు లారీ బ్రేకులు ఆకస్మికంగా పడ్డాయి. దీంతో ఒకవైపు తిరిగింది. దీని వెనుకే వస్తున్న మరో లారీ ముందున్న లారీని ఓ వైపుగా ఢీకొట్టింది. దీంతో క్యాబిన్ నుజ్జుకాగా, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుకున్నాడు. ఒక కాలు బయటకు తీసే అవకాశం లేకుండా పోయింది. దీంతో వేటపాలెం జనార్ధన్ ఘటనా స్థలానికి చేరుకొని రెండుగంటల పాటు శ్రమించి క్యాబిన్‌లోని ర్యాడ్లను కట్ చేయించి డ్రైవర్‌ను బయటకు తీయించారు. చికిత్స నిమిత్తం వైద్యశాలకు పంపించారు. ఈ ఘటనతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు.

వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్

● నగరంలో 8 బృందాలతో తనిఖీలు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో శనివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ఎనిమిది ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదన చేస్తున్న 13మంది మైనర్లు, 33మంది రహదారి నిబంధనలు అతిక్రమించినవారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ మైనర్లు వాహనచోదన చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవల్సి ఉంటుందని హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదంటూ కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావును నియమించారు. ఈమేరకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో శ్రీనివాసరావు శనివారం ఒంగోలులో ఎస్పీ వి.హర్షవర్ధనరాజును కలిసారు. శ్రీనివాసరావుకు అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న శ్రీనివాసరావు గతంలో పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

చదువుకున్న స్కూల్‌ను మరువొద్దు

● మంత్రి స్వామి

● ముప్పవరం స్కూల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

కొండపి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): చిన్నపుడు చదివిన స్కూళ్లను మరువొద్దని, విద్యాబుద్ధులు అందించిన స్కూల్ అభివృద్ధికి తమవంతు సహకారం దాతలు అందించాలని సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని ముప్పవరం జడ్పీస్కూల్‌కు పూర్వ విద్యార్థులు దాదాపు 10 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పలు అభివృద్ధి పనులను స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను విద్యాశాఖామంత్రి నారా లోకేష్ సారథ్యంలో చేపట్టిందన్నారు. ఇదే సమయంలో స్కూళ్ల పూర్వ విద్యార్థులు కూడా తాము చదువుకున్న స్కూళ్ల పరిస్థితిని గమనిస్తుండాలని, ప్రజలు కూడా ప్రభుత్వ స్కూళ్ల పనితీరులో, వసతుల కల్పనలో భాగస్వాములు అవ్వడం ద్వారా ప్రభుత్వ స్కూళ్లు మరింత బలోపేతం అవుతాయని, ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. జడ్పీస్కూల్‌లో 5 లక్షల రూపాయలతో అదనపు తరగతి గదులు నిర్మించిన పెరిదేపి గ్రామానికి చెందిన ముప్పరాజు శ్రీనివాసరావును, స్కూల్ ముఖద్వారం, ప్రహరీగోడ, మొక్కలు ప్లాంటేషన్‌కు మూడు లక్షలు రూపాయలు వెచ్చించిన మిట్టపాలెం గ్రామ పూర్వ విద్యార్థి కొల్లూరి శ్రీహరిరావును, మినరల్ వాటర్‌ప్లాంట్‌కు మిషనరీకి లక్షన్నర రూపాయలు అందించిన తాళ్లూరి రమాకుమారిని, వాటర్ ప్లాంట్‌కు, షెడ్డు నిర్మాణానికి లక్ష రూపాయలు ఇచ్చిన ప్రస్తుత స్కూల్ హెచ్‌ఎం బడే కోటిరెడ్డిని, భవిష్యత్ అవసరాలకోసం స్కూల్‌కు లక్షా యాభైవేలు అందించిన చిన్నం లక్ష్మీనర్సు కుటుంబాన్ని మంత్రి స్వామి ఈసందర్భంగా అభినందించారు. అదేవిధంగా ఇక నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు పెరుగును అందించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. కార్యక్రమంలో దాతలతోపాటు కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకుడు బత్తుల నారాయణస్వామి, టీడీపీ నాయకుడు నరసారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎక్కిరాల భరద్వాజ విగ్రహ ప్రతిష్ఠ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 10వ తేదీన ఒంగోలు నగరం లాయర్‌పేట సాయిబాబా మందిరంలో జరుగుతుందని షిరిడి సాయి కల్చరల్ మిషన్, శ్రీభరద్వాజ్ విగ్రహ ప్రతిష్ఠ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శనివారం స్థానిక సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం సాయిబాబా, సాయి మాస్టర్ విగ్రహాల నగరోత్సవం ఉంటుందన్నారు. ఇక 10వ తేదీ శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే సాయి మాస్టర్ బృందావనంలో ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సమావేశంలో మందిర కమిటీ అధ్యక్షురాలు మల్లాది సుబ్బలక్ష్మమ్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, కార్యదర్శి మేడ జయరాం, ఉప కార్యదర్శి రుద్రవరపు సాయిబాబు, కోశాధికారి శ్రీధర్, కమిటీ సభ్యులు గోపాలరావు, అంజయ్య, విజయ్ కుమార్, చంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి, సాయిరాజు, సుధారాణి, ప్రమీలాదేవి, వాసు ఆచారి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దళిత, బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత, బహుజనులు అలంకారప్రాయమైన పదవుల కోసం కాకుండా నిర్ణయం చేయగలిగే అధికారం కోసం ఉద్యమించాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తడ నుంచి తుని వరకు చేపట్టిన పాదయాత్ర శనివారం రాత్రికి నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్‌కాలనీలో నిర్మించిన ఐక్యతా స్థూపాన్ని ఆయన విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం చదలవాడ పశుక్షేత్రం ఎదురుగా ఉన్న వెంచర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం అధికారం దళిత, బడుగు, బలహీన వర్గాలు, మహిళల చేతుల్లో లేదన్నారు.

పేదలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్న పాలకులు తదనంతరం వారికి నమ్మకద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నోచోట్ల దళితులపై దాడులు జరిగినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. సభలో పలువురు నాయకులు విజయ్‌కుమార్‌కు జ్ఞాపికలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజయశ్రీ, దమ్ము చెన్నకేశవులు, ఎస్.కృష్ణాఫర్, ఇసుక గోపి, కేజీ.శ్రీనివాస్, వంతు శ్యాంప్రకాశ్, లేళ్లపల్లి చంద్ర, మాచవరపు జూలియన్, మల్లెల బుల్లెబ్బాయి, చిడితోటి శోభన్‌బాబు, చిడితోటి సుధీర్‌బాబు, మదన్‌మిత్రా, హెఫ్సీబా, బుద్ధకోటి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప అఖండ పడిభజన



చీమకుర్తిలో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి మండపం

చీమకుర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని రామనగర్‌లో శనివారం రాత్రి అయ్యప్పస్వామి అఖండ పడిభజనను అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పోతురాజు శ్రీనుస్వామి తన ఇంటి ఆవరణలో భారీ సెట్టింగ్‌తో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శివ గురుస్వామి ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో దీక్షదారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేటినుంచి హరిహరక్షేత్రంలో అన్నసంతర్పణ

చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో సర్వదీక్షాధారులకు ఆదివారం నుంచి అన్నదానాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో కలశ ప్రతిష్ఠ, విశేషపూజలు, పడిభజన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

● ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం అఖిత భారత యువజన సమాఖ్య ఆఫీసు బేరర్ల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కరుణానిధి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ఆర్భాటపు ప్రచారాలు చేసి తరువాత విస్మరించారని మండిపడ్డారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వ ధ్యేయమని, లేనిపక్షంలో ఐదువేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభాకర్, సహాయ కార్యదర్శి సబ్బు, రామాంజి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మూలగుంటపాడులో భూసమస్యల పరిష్కారం

● మంత్రి స్వామికి గ్రామస్థుల కృతజ్ఞతలు



మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలుపుతున్న టీడీపీ నేతలు

సింగరాయకొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు గ్రామ పంచాయతీలోని 108/3 సర్వేనంబరులో గత ప్రభుత్వం రీసర్వే అసమగ్రంగా చేసిన కారణంగా భూముల రిజిస్ట్రేషన్ ఇబ్బందికరంగా మారింది. ఈ సర్వే నంబర్‌లో అధిక విస్తీర్ణం ఉంది. గడచిన ఏడాదికాలంగా ఈసర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో క్రయవిక్రయాలు ఆగిపోయి వందలాది మంది ఇబ్బందులు పడ్డారు. అయితే సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య దృష్టికి గ్రామస్థులు పలు దఫాలు తీసుకువెళ్లారు. ఈ సమస్యపై ఇరువురూ రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య పరిష్కారం అయ్యింది. రిజిస్ట్రేషన్‌ల నిషేధాన్ని తొలగిస్తూ జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామిని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, నాయకులు చిగురుపాటి గిరి, సన్నెబోయిన మల్లికార్జున, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా షూటింగ్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా బాల, బాలికల షూటింగ్ పోటీలు శనివారం ఒంగోలులోని నెక్స్‌జెన్ స్కూలులో ఉత్సాహంగా సాగాయి. ఈ మేరకు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యేందుకు పోటీ పడ్డారు. రెండు రోజుల నుంచి ఎంపిక పోటీలు జరుగుతుండగా, ఆదివారంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చక్కా వెంకటేశ్వర్లు, శిరీషాకుమారి, వ్యాయామోపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో రామాంజనేయులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ నేత బొమ్మినేని రామాంజనేయులు కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో అండర్-14 విభాగంలో ఎండ్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెం ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం వారిని రామాంజనేయులు అభినందించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందిస్తామని తెలిపారు. హెచ్‌ఎం శేషిరెడ్డి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

అద్దంకి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినాన్ని పురష్కరించుకొని ఆదివారం అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పెదకాకాని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మానం మురళీమోహన్‌దాస్, క్లష్టర్ ఇన్‌చార్జ్ కరి పరమేష్ తదితరులు పరిశీలించారు.

దీక్షాదారులకు అన్నదానం


పట్టణంలోని వేయిస్తంభాల గుడిలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినం సందర్భంగా దీక్షాదారులకు అన్నాదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలుగుయువత నేత పెంట్యాల రామాంజనేయులు తెలిపారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● పూటుగా మద్యం సేవించి ఉండడంతో స్థానికుల ఆందోళన

● డ్రోన్, నిపుణుల పర్యవేక్షణలో రక్షణ ఏర్పాటు చేసిన పోలీసులు

● టవర్ నుంచి కిందకు దిగేలా కౌన్సిలింగ్



టవర్‌పై ఉన్న యువకుడు నిఘా ఉంచిన డ్రోన్

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్వారీలో పనుల నుంచి తొలగించారని మల్లాయపాలెం గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి ఆత్మహత్య కు యత్నించాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించి ఉండడంతో ఎక్కడ పడిపోతాడో అని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే విషయం తెలుసుకున్న సంతమాగులూరు సీఐ వెంకట్రావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజులు టవర్ వద్దకు చేరారు. ఉన్నతాధికారుల సూచనలు నిపుణుల సలహాలతో పాటు డ్రోన్ కెమెరాతో పూర్తి పర్యవేక్షణ ఏర్పాటు చేసి రాజేష్‌తో మాట్లాడారు. అతడిని ఒప్పించి టవర్‌పై నుంచి దింపారు. గ్రామానికి చెందిన వారి బంధువులను అక్కడకి పిలిపించి వారితో చర్చించారు. రెండు గంటల పాటు ఉత్కంటగా సాగిన ఈ వ్యవ హారం టవర్‌పై నుండి యువకుడు దిగడంతో సుఖాంతమైంది..



కిందకు దిగిన రాజేష్

దొడ్డవరంలో విజృంభించిన గున్యా

● ఇబ్బందిపడుతున్న బాధితులు

మద్దిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామంలో గున్యా జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానిక బీసీ కాలనీ, అరుంధతి నగర్‌లో పలువురు జ్వరంతో అల్లాడుతున్నారు. కొంతమంది రోగులు ఒంగోలులోని వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు ఇంటివద్ద ఉండి ఆర్‌ఎంపీలతో చికిత్స పొందుతున్నారు. అలాగే వారం రోజుల నుంచి విషజ్వరాలతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గ్రామంలోకి వైద్య సిబ్బంది వచ్చిన పాపాన పోలేదు. గ్రామలో చిన్నారులు, వృద్ధులు జ్వరం ఒళ్లునొప్పులతో బాధపడుతున్నారు. కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అధికారులు స్పందించి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మైనంపాడులో ఫాగింగ్

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మైనంపాడులో శనివారం పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అనంతరం కాలువల్లో ఎబెట్, బ్లీచింగ్ చల్లించారు. ఇళ్ల వద్ద ఖాళీటైర్లలోను, తాగిపడేసిన కొబ్బరిబొండాల్లో నీటినిల్వలను ఉంచొద్దని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, సర్పంచ్ దాట్ల రమణమ్మ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కొమ్మమూరు కాలువ గండ్లను పరిశీలించిన ఎస్ఈ



కొమ్మమూరు కాలువ గండిని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరత్నం

చినగంజాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా మండల పరిధిలో కొమ్మమూరు కాలువకు పడిన గండ్లను నీటి పారుదల శాఖాధికారులు శనివారం పరిశీలించారు. నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకటరత్నం, డీఈ ప్రసాదు, ఏఈ ఏ.శ్రీధర్‌లు కొమ్మమూరు కాలువకు పలు చోట్ల పడిన గండ్లను పరిశీలించారు. సోమవారం కేంద్ర పరిశీలనా బృందం తుఫాన్ వలన కొమ్మమూరు కాలువకు పడిన గండ్ల పరిశీలించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో నీలాయపాలెం గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగా విగ్రహ ఆవిష్కరణ

యద్దనపూడి(మార్టూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం కటారివారిపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం మాజీ శాసనసభ్యులు దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, చీరాలకు చెందిన కాపునేత ఆమంచి స్వాములు హాజరయ్యారు. గ్రామంలోని చెరువకట్ట సమీపంలోని ఓవ్యక్తికి చెందిన సొంతస్థలంలో వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాపునేతలు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. స్థానిక ఎస్.ఐ. టిరత్నకుమారి బందోబస్తు నిర్వహించారు.

కుంకలమర్రులో అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ.80 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కుంకలమర్రు (పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శ్రీకారం చుట్టారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా రూ.80 లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఏలూరికి పూలమాలలు వేసి కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. గ్రామ శివారులోని మహా ప్రస్థానంలో కైలాసనాథుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, నీటి వసతి, డ్రైనేజ్, విద్యుత్ తదితర మెరుగైనా వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ప్రజలు సమష్టిగా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మాల కార్పోరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుములశెట్టి శ్రీహరి, షేక్. ఖాశీం, బంగారుబాబు, రావి శేషయ్య, రాఘవయ్య, మణికంఠ, శ్రీనివాసరావు, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారధ్యంలో శనివారం మార్టూరు ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాయంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు, ఏలూరి నాగేశ్వరరావుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈవైద్య శిబిరంలో మొత్తం 300 మంది హాజరు కాగా అందులో 120 మందికి శస్త్ర చికిత్స అవరం అని వైద్యులు నిర్ధారించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సేవ చేయాలన్న సంకల్పంతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు స్వీకారం చుట్టడం జరిగిందన్నారు. లక్ష మంది నిరుపేదలకు కంటి చూపు అందించటమే తనముందున్న లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, సీనియర్ నాయకులు ఆదినారాయణ, రంగయ్య, తిరుముల శెట్టి శ్రీహరి, శంషుద్దీన్, సీతయ్య, తారక రామారావు, సాంబయ్య, సురేష్, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

ఇంటర్ డ్రిస్టిక్ట్ టెన్నికాయింట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



క్రీడల్లో రింగ్ విసురుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని రకాల క్రీడలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఆంధ్ర రాష్ట్ర ముద్దుబిడ్డ క్రికెట్ క్రీడాకారిణి శ్రీచరణి స్ఫూర్తితో అందరు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శనివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ మైదానంలో 42వ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పోటీలకు రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి జూనియర్స్ బాలబాలికలు సుమారు 200 మంది హాజరయ్యారు. శని, ఆదివారం రెండురోజులు జరిగే ఈ పోటీలు స్టేట్ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదూర ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిన చిన్నారులను అభినందించారు. గత ప్రభుత్వం క్రీడలకు సంబంధించి నిలిపివేసిన ఇన్‌సెంటివ్‌లు కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్లు వివరించారు. క్రీడలను ప్రారంభించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో శాప్ డైరక్టర్ పేరం రవీంద్రనాథ్, సెక్రటరీ ఎన్వీ సత్యనారాయణ, కోశాధికారి కుంచే రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.అలేఖ్య, జిల్లా కోశాధికారి కొల్లయ్య, దీప్తి, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధునికయుగంలో ప్రజలతో విడదీయరాని భాగంగా మీడియా

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో మీడియా మన జీవితంలో విడదీయరాని భాగంగా మారిందని సాహితీ కౌముది అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి అన్నారు. సాహితీ కౌముది ఆధ్వర్యంలో శనివారం పుట్టంరాజు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ టీవీ చానళ్లపై రాసిన పలు గ్రంథాలపై విశ్లేషణాత్మక పరిచయాలు జరిగాయి. కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ, గాడేపల్లి దివాకరదత్, జాగర్లమూడి ప్రతాప్, పాలపర్తి జ్యోతిష్మతి, ఇలపావులూరి శేషతల్పసాయి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, నిమ్మరాజు నాగేశ్వరరావు, దేవపాలన తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ



ఎఫ్‌డీపీ పత్రాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎఫ్‌డీపీ (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్) సోమవారం నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమానికి కన్వీనర్ ప్రొఫెసర్ డా.ఇంద్రనీల్ శ్రీరామ్, కో కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డా.వీవీ.ప్రవీణ్‌కుమార్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. శనివారం అందుకు సంబంధించిన పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి మృతికి ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

కారంచేడు (పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామానికి చెందిన విద్యార్థిని యార్లగడ్డ రాజ్యలక్ష్మి(23) అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తూ అనారోగ్యానికి గురై మృతి చెందిన ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతిపట్ల కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిన్న వయస్సులోనే మృత్యువు ఆమెను కబళించటం బాధాకరమన్నారు. రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను శనివారం ఫోన్ ద్వారా పరమర్శించారు. అన్ని విధాలుగా సాయం అందిస్తామన్నారు. అమెరికా నుంచి ఆమె మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లి ఇలా మృత్యువాత పడడం దురదృష్టకరమన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

- పాపాయిపాలెంలో ప్రభుత్వ సాయాన్ని పంపిణీ చేసిన నేతలు



నగదు సాయం అందజేస్తున్న కూటమి నాయకులు, అధికారులు

పాపాయిపాలెం(చీరాల), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బారినపడి నష్టపోయిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పలువురు కూటమి నేతలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తుఫాన్ బాధితులకు అందిస్తున్న రూ.3 వేల ఆర్థిక సాయం, బియ్యాన్ని శనివారం వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య బాధితుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పులి హరికృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, గవిని పోతురాజు, వీఆర్వో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

- మరో ఇద్దరు సురక్షితం
- ఇడుపులపాడులో ఘటన
- ఈత సరదాతో చెరువులో దిగిన ముగ్గురు యువకులు



సుమంత్ (ఫైల్)

ఇంకొల్లు, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి) : ఈత సరదాలో చెరువులో దిగిన ముగ్గురులో ఇద్దరు సురక్షితంగా బయటపడి ఒక యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇడుపులపాడులో శనివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన బండారు సుమంత్(16),కొర్నేలు,అనీల్ ఈతకు ఎస్సీకాలనీ సమీపంలోని చెరువులో దిగారు.బండారు సుమంత్ చెరువులో నుండి బయటకు రాలేక పోయారు.మిగిలిన ఇద్దరు బయటకు చేరుకొని విషయం స్థానికులకు తెలిపారు.సుమంత్ ఆచూకి తెలియకపోవడంతో సిఐ వై.వి రమణయ్య,ఎస్సై సురేష్,తహశీల్దారు శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. చీరాల బోట్‌ను తెప్పించి చెరువులో గజ ఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమంత్ తండ్రి భూషయ్య పరుగు జిల్లాలో బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. సుమంత్ చీరాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రాత్రి 9 గంటల వరకు సీఐ రమణయ్య ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ సుమంత్ మృతదేహం ఆచూకి తెలియలేదు. చెరువు చుట్టూ సమీప బంధుమిత్రులు సుమంత్ మృతదేహం కోసం వేచి చూస్తున్నారు. అధికారులు సుమంత్ తల్లిదండ్రులకు సమాచారం అందిచారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఇంకొల్లు, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణికి గ్రామ పొలాల సమీపంలోని వాగు వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు శనివారం పోలీసులు గుర్తించారు. మృతదేహం బాగా కుల్లిపోయి ఉంది. స్త్రీ లేదా పురుషుడా అనేది కూడా గుర్తించలేని విధంగా మృతదేహం ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల నీటి ఉధృతికి కొట్టుకు వచ్చి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్కిల్ కాంపిటేషన్లో కొండమంజులూరు విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

పంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్కిల్ కాంపిటేషన్లలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రిటైల్ ఒకేషనల్ ట్రేడింగ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ పోటీలు జిల్లా కేంద్రమైన బాపట్లలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సీహెచ్ పవన్ గోపీకృష్ణ సీహెచ్. హర్షవర్ధన్‌రాజు, ఎ.హర్షవర్ధన్, సీహెచ్. పూర్ణనాగచరణ్‌రాజులు మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన గంగాభవాని ప్రసాద్‌ను పాఠశాల హెచ్ఎం ఎం.అనిత ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

రావిచెట్టు వీరాంజనేయస్వామికి విశేష పూజలు



లక్ష నాగవల్లీ దళార్చన పూజలు చేస్తున్న వేదపండితులు

పంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు గ్రామంలో వేంచేసిన శ్రీరావిచెట్టు వీరాంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం వేదపండితులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి మహా మన్యుసూక్త అభిషేకం, లక్ష నాగవల్లీ దళార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరశింహరావు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల ఆటస్థలం అభివృద్ధికి రోటరీక్లబ్ చొరవ



మైదానాన్ని చదును చేస్తున్న రోటావేటర్

బల్లికురవ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): బల్లికురవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం పెద్దఎత్తున గడ్డితో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు మార్టురు రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు దృష్టికి తీసుకు వెళ్లారు. రోటరీ క్లబ్ తరఫున శనివారం ట్రాక్టర్‌తో పాఠశాల ఆటస్థలంలో ఉన్న గడ్డిని దున్నించారు. పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని రోటరీ ప్రదినిధులు తెలిపారు. ఆట స్థలంలోని రన్నింగ్ ట్రాక్‌ను కూడా సరిచేసి వాకింగ్‌కు ఉపయెగ పడేలా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రోటేరీయన్ గాలి గంగాధర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం డేవిడ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ నేతలను మా కాలనీకి రానివ్వం'



అనిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్టీఆర్ కాలనీవాసులు

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో అతి నిరుపేదలు ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటు న్నారని, అలాంటి నిరుపేదలను ఖాళీ చేయించేందుకు వైసీపీ నేతలు కు ట్ర పన్నారని, అలాంటి వైసీపీ నేతలు కోటి సంతకాల పేరుతో తమ కాలనీకి వస్తే అడ్డుకుంటామని పలువురు తేల్చి చెప్పారు. వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కు తమ కాలనీకి రావద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు పలువురు కాలనీ వాసులు సంతకాలు చేసి టీడీపీ నాయకుడు కోనేటి అనిల్ కు అందజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బల్లికురవ, నవంబరు 8 డ(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన వంకం వీరాంజనేయులు(65) అను రైతు శనివారం పురుగుమందు తాగి అత్మహత్యకు పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు వీరాంజనేయులు తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు గ్రామంలో మరి కొంత పొలాన్ని కౌలకు తీసుకుని సాగు చేశాడు. పొలంలో నష్టాలు వచ్చాయి. దీంతో అప్పులు రోజురోజుకు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందును తెచ్చుకొని ఇంట్లోనే తాగి అత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు.

www.andhrajyothy.com
8 పేజీలు
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI ఆదివారం 9-11-2025 బాపట్ల / ఒంగోలు


విదేశీ పర్యటనలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్


దివ్యాంగురాలికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి అంటే మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఎనలేని మక్కువ. నియోజకవర్గ ప్రజలకు కూడా ఆయనంటే కొండంత అభిమానం. ఆ మక్కువ, అభిమానాలే వారి మధ్య విడదీయరాని అనుబంధాన్ని పెంచాయి. అది పార్టీలకతీతంగా రవికుమార్‌ను విజయపథంలో నడిపిస్తోంది. తాను ఉన్నత శిఖరాలను అందుకున్నా... 'నా అద్దంకి అభివృద్ధి' అనే తపన, ఆరాటాన్ని రవికుమార్‌లో పెంచింది. ఫలితంగా అద్దంకి అభివృద్ధిపథంలో పయనిస్తోంది. నిజానికి రవికుమార్ ఇప్పటికి ఐదు పర్యాయాలు శాసనసభకు ఎన్నికయ్యారు. అందులో గత నాలుగు పర్యాయాలు అద్దంకి నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అద్దంకిలో తొలి రెండు సార్లు వేర్వేరు పార్టీల నుంచి విజయం సాధించిన ఆయన గత రెండు పర్యాయాలు తెలుగుదేశం నుంచి గెలుపొందారు. టీడీపీలో చేరిన తర్వాత రాజకీయంగా బలంగా ఎదిగారు. నియోజకవర్గంలో నిలదొక్కుకున్నట్లే.. నిబద్ధతతో పనిచేసి టీడీపీలోనూ అందలానికి చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు తలలో నాలుకలా మారారు. ఆపై రాష్ట్ర మంత్రి అయ్యారు. పదవులు వరించాయి.. పరపతి పెరిగింది.. అంతకుమించి బాధ్యతలు పెరిగాయి.. దీంతో రవికుమార్ నియోజకవర్గానికి దూరమవుతారని ప్రజలు భావించారు. కానీ అలా కాకుండా.. రవికుమార్ నియోజకవర్గంపై మరింత దృష్టి సారించారు. రోజులో ఒకపూట నియోజకవర్గం, మరోపూట సచివాలయం అన్నట్లుగా ప్రజలతో కలిసి తిరుగుతూనే ఉన్నారు. దానికి తోడు పెరిగిన పరపతి, లభించిన మంత్రి పదవితో మరింత అభివృద్ధికి శ్రీకారం పలికారు. గతంలో కేవలం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే భవనాసి రిజర్వాయర్‌కు బీజం వేశారు. పాలిటెక్నిక్ కాలేజీని తెచ్చారు. సాగర్ కాలువల రూపురేఖలు మార్చి రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రమారమి 3వేల మందికిపైగా వైద్య చికిత్సలకు ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించారు. ఇప్పుడు మంత్రి పదవి కూడా ఉండటంతో అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. రూ.120 కోట్ల వ్యయంతో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం పలికారు. మరో రూ.100 కోట్ల నిధులను రోడ్ల నిర్మాణానికి సాధించారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని రాబట్టడంలో రాష్ట్రంలో మొదటి మూడు స్థానాలలో ఒకరిగా నిలిచారు. ఇప్పటికే 1,700 మందికి సీఎం సహాయ నిధిని అందించగలిగారు. ఇంకోవైపు 10వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీకి శ్రీకారం పలికి ఇప్పటికే 4వేల మందికి ఇచ్చారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ లాంటి చేయూత కార్యక్రమాలు భారీగా చేస్తున్నారు. సాగర్ కాలువల అభివృద్ధికి సొంత నిధులు సైతం వెచ్చిస్తున్నారు. అద్దంకి రూపురేఖలు మార్చి నగర స్థాయిని కల్పించే పనిలో రవికుమార్ నిమగ్నమయ్యారు. అందులో భాగంగా మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. అద్దంకి నియోజకవర్గం నుంచి ప్రయాణానికి అనువుగా మోటుపల్లి నుంచి ఎర్రగొండపాలెం సమీపంలోని కుంట వరకు రోడ్డు నిర్మాణానికి చొరవ చూపారు. ఆయన ఎంత ఎదిగినా, ఎన్ని బాధ్యతలు తలపై పడినా అద్దంకి అభివృద్ధి-అద్దంకి ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత అన్న చందంగా ముందుకు సాగుతూ ప్రజాభిమానాన్ని మరింత పెంచుకుంటున్నారు.


విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్


పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న రవికుమార్

అందరివాడు



అభిమానం... అనుబంధం.. అభివృద్ధి..

- హామీల అమలులో దిట్ట
- తిరిగి ప్రకాశంలోకి అద్దంకి
- మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయికి పెరుగుతున్న హోదా
- అద్దంకి అభివృద్ధి కోసం అహరహం కృషి
- ప్రజలతో మమేకం
- పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలతో ప్రజాభిమానాన్ని మరింత పెంచుకున్న మంత్రి రవికుమార్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

కీలకమైన హామీలను అమలు చేయడంలో మంత్రి రవికుమార్ సఫలీకృతులయ్యారు. ప్రధానంగా ఎన్నికలకు ముందు నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో కోరిన విధంగా అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలోకి చేర్పించే విషయంలో చాకచక్యంగా వ్యవహరించారు. ఎన్నికలకు ముందే ఇటు చంద్రబాబు, అటు లోకేష్ ద్వారా ప్రజలకు బహిరంగంగా హామీ ఇప్పించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాపట్ల జిల్లా నుంచి మంత్రి పదవి పొందిన రవికుమార్ జిల్లా మార్పు విషయంలో వెనకడుగు వేయవచ్చని రాజకీయ పరిశీలకులు ఊహించారు. అయితే రవికుమార్ మాత్రం ఆ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదిపారు. తొలుత అద్దంకిని రెవెన్యూ డివిజన్ చేయాలని ప్రతిపాదించారు. తనకు సన్నిహితుడైన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పరిస్థితిని వివరించి ఒప్పించారు. ఆతర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అంతటితో ఆగకుండా నియోజకవర్గస్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు ఉన్న సంబంధిత అధికారులతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనను సిద్ధం చేయించారు. ప్రతిపాదన ఓకే కాగానే జిల్లా మార్పుపై దృష్టి సారించారు. తదనుగుణంగా అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపే విధంగా మంత్రివర్గ ఉపసంఘం సభ్యుల దృష్టికి తీసుకెళ్లి వారి నివేదికలో పొందుపర్చారు. ముందుగా రెవెన్యూ డివిజన్‌కు రంగం సిద్ధంచేయడంతో నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చే అంశం వచ్చినా డివిజన్ ప్రతిపాదనకు ఇబ్బంది లేకుండా లైన్ క్లియర్ అయింది. ఈ విషయంతోపాటు పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు కూడా గతంలో చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ వారిని అప్రమత్తం చేశారు. మంత్రి వర్గ ఉపసంఘంలో రవికుమార్ లేనప్పటికీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డివిజన్ల ఏర్పాటు, నియోజకవర్గాల మార్పు, కొత్త జిల్లా ఏర్పాటు విషయంలో ఆయన అభిప్రాయాన్ని కీలకంగా తీసుకోవడం విశేషం.

గ్రామస్థాయి వరకు అదే పంథా

నియోజకవర్గం నుంచి గ్రామస్థాయి వరకు ఏదైనా ప్రజాసమస్యలు, అభివృద్ధి పనులపై ఆయన హామీ ఇచ్చి ఉంటే వాటి అమలుకు శక్తివంచన లేకుండా పనిచేయడం కూడా గొట్టిపాటి నైజం. ఉదాహరణకు సాగర్ కాలువల మరమ్మతుల విషయంలో హామీ ఇచ్చారు. నిధుల మంజూరుకు జాప్యమవడంతో సొంత సొమ్ముతో తాత్కాలిక మరమ్మతులు చేయించి నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చేశారు. లింకు రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల ఏర్పాటుకు సంబంధించి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. వ్యక్తిగతంగా చేయూత విషయంపై ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఈ పర్యాయం సొంత నిధులు, దాతల సహకారంతో భారీగా చేపట్టారు.


పార్టీ కార్యక్రమంలో..

పాలన, పార్టీ వ్యవహారాల్లో కీలక బాధ్యతలు

- ఎక్కడ పార్టీ కార్యక్రమం ఉంటే అక్కడ మకాం
- రెండు జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రి
- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆంతరంగిక చర్చల్లో భాగస్వామి

పాలన, పార్టీ వ్యవహారాల్లో మంత్రి రవికుమార్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక బాధ్యతలు అప్పజెప్పడం విశేషం. పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఆయన్ను ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. వాటితోపాటు ఆయా సందర్భాల్లో రాజధాని సమీపంలోని కొన్ని జిల్లాల్లో సమస్యలు వచ్చినప్పుడు ప్రత్యేకంగా వాటి పరిష్కార బాధ్యతలు అప్పగిస్తున్నారు. పాలన, పార్టీ వ్యవహారాలపై అంతరంగికంగా జరిగే సమావేశాలకు అటు చంద్రబాబు, ఇటు లోకేష్ ప్రత్యేకంగా రవికుమార్‌ను పిలిపించుకొని మాట్లాడిన సందర్భాలు అనేకం. ముఖ్యనేతలతో పార్టీ వ్యవహారాలపై సమీక్ష జరిగినా రవికుమార్‌కు తప్పని సరిగా ఆహ్వానం అందుతోంది. అంతేకాక పార్టీ పరంగా ఏజిల్లాలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరిగినా అక్కడ కీలక బాధ్యతలు నిర్వహించే వారిలో రవికుమార్ ఒకరిగా ఉంటున్నారు. మహానాడు నిర్వహణ సందర్భంగా కడప, సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం నిర్వహణ సందర్భంగా అనంతపురం, జీఎస్టీ విజయోత్సవం సందర్భంగా కర్నూలులో జరిగిన భారీ కార్యక్రమాల నిర్వహణల్లో రవికుమార్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. ఆయా జిల్లాల్లో నాయకుల మధ్య సమన్వయం, జనసమీకరణ అంశాల్లో అన్ని రకాల బాధ్యతల్లో రవికుమార్ కీలక పాత్ర పోషించారు. ఎవరు అవునన్నా కాదన్నా ఉమ్మడి జిల్లాలో పార్టీ, పాలనాపరమైన వ్యవహారాల్లో క్లిష్టమైన నిర్ణయం తీసుకునే సందర్భంలో రవికుమార్ అభిప్రాయాన్ని కచ్చితంగా అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటు మంత్రి లోకేష్ పరిగణనలోకి తీసుకుంటున్నారు. అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి.


ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న మంత్రి రవికుమార్


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి రవికుమార్

ఓర్పు... నేర్పు...

- అవే గొట్టిపాటి విజయ రహస్యాలు
- గ్రామంలో ఎన్ని గ్రూపులున్నా అందరూ ఆయన వెంటే

ఆంధ్రజ్యోతి, ఒంగోలు:

ఓర్పు, నేర్పుతో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో రాజకీయంగా విజయపథంలో పయనిస్తున్నారు. నాయకులను, పార్టీలో అభిమానులను తానెటున్నా తనకు మద్దతుగా నడిపించుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. గ్రామ, మండల స్థాయి రాజకీయాల్లో ఎలా ఉన్నా తనవరకు వచ్చే సరికి తనకు మద్దతుగా నిలబడే విధంగా వారిని చేసుకోవడంలో కూడా రవికుమార్ సఫలీకృతులవున్నారు. అందుకు ప్రధానంగా ఆయా నాయకులతో ఉన్న విషయాన్ని విడమర్చిచెప్పడం, ఎవరి అవసరాలకు అనుగుణంగా వారికి ప్రభుత్వ పథకాలను అందించడం, అభివృద్ధి పనులు చేయడం ద్వారా అందరి మద్దతు పొందగలుగుతున్నారు. అన్నింటికీ మించి కక్షసాధింపు రాజకీయాల జోలికి వెళ్లకపోవడం అందరి మద్దతు పొందడంలో కీలకమైంది. 2004 ఎన్నికలకు ముందు అనూహ్యంగా రాజకీయ అరంగేట్రం చేసిన రవికుమార్ తెలుగుదేశంలో చేరేందుకు ప్రయత్నించారు. అప్పట్లో మార్టూరు ఎమ్మెల్యేగా మాజీ మంత్రి హనుమంతరావు కుమారుడు నరసయ్య ఉన్నారు. ఆయన్ను కాదని మార్టూరు టికెట్ ఇవ్వలేనని చంద్రబాబు చెప్పడంతో కాంగ్రెస్‌లో చేరిన రవికుమార్ ఆ ఎన్నికల్లో విజయం సాధించారు. 2009 ఎన్నికల నాటికి మార్టూరు నియోజకవర్గం రద్దవడంతో అద్దంకి నుంచి రంగంలోకి వచ్చారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీచేసిన రవికుమార్ కాంగ్రెస్‌వాదులతోపాటు అప్పటి టీడీపీ నాయకుడు బలరాం వ్యతిరేకులను కలుపుకొని వెళ్లడంలో సక్సెస్ అయ్యారు. 2014లోనూ అదే పంథాలో ముందుకు సాగిన ఆయన, ఆ తర్వాత పూర్తిగా తనకంటూ ఒక ప్రత్యేక మద్దతుదారులను ఏర్పాటు చేసుకునే విషయంలో సఫలీకృతులయ్యారు. 2015లో తెలుగుదేశంలో చేరిన తర్వాత పైస్థాయిలో చంద్రబాబు మద్దతున్నప్పటికీ కిందిస్థాయిలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. అయినా నియోజకవర్గంలో తన అనుచరులతోపాటు టీడీపీ శ్రేణుల నుంచి కూడా లభించిన మద్దతుతో నిలదొక్కుకున్నారు. ఆ తర్వాత తన మద్దతుదారులను, టీడీపీ శ్రేణులను కలుపుకుపోవడంలో ఆయనకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019 ఎన్నికల్లో బలరాంను చీరాల నియోజకవర్గానికి పంపి అద్దంకి నుంచి రవికుమార్‌ను పోటీలోకి దించారు. ఈ సందర్భంగా రవికుమార్ అనుచరులకు, టీడీపీలోని బలరాం వర్గీయుల మధ్య గ్రామాల్లో సమస్యలు ఎదురయ్యాయి. అవకాశం ఉన్న గ్రామాల్లో ఇరువైపుల వారి మద్దతు పొందడంలో రవికుమార్ వ్యూహం ఫలించింది. కొన్ని గ్రామాల్లో ఫలించకపోయినా రవికుమార్ విజేతగా నిలిచారు. ఆతర్వాత క్రమంలో చీరాల ఎమ్మెల్యేగా బలరాం వైసీపీలో చేరిన తర్వాత అద్దంకి నియోజకవర్గంలోని మరికొందరు టీడీపీలోని బలరాం అనుచరులు రవికుమార్‌తో కలిసేందుకు సిద్ధమయ్యారు. మేదరమెట్ల, అద్దంకి లాంటి కీలకప్రాంతాల్లో బలరాంకు కుడి, ఎడమ బుజాలుగా నడిచిన వారు గత ఎన్నికల సమయం నుంచి రవికుమార్‌తో పయనిస్తున్నారు. గత ఎన్నికల్లో గెలిచి రవికుమార్ మంత్రి అయి ఏడాదిన్నర అయినా కూడా అలాంటివారందరినీ టీడీపీ శ్రేణులుగానే తనతో నడుపుకోవడంలో సఫలీకృతులవుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ ఆది నుంచి రవికుమార్‌తో ఉన్న టీడీపీ గ్రూపు, గత ఎన్నికల్లో రవికుమార్‌కు మద్దతు ఇచ్చిన టీడీపీ శ్రేణులకు ఏమాత్రం సఖ్యత లేదు. అయినా ఎక్కడా ఆయా గ్రూపుల నాయకులు బహిర్గతమై వాదనలకు దిగే పరిస్థితి రాకుండా అందర్నీ తనతో నడుపుకుంటున్న తీరు రవికుమార్ ఓర్పు..నేర్పునకు దర్పం పడుతోంది. ఇటీవల కొన్ని గ్రామాల్లో అనాదిగా టీడీపీలో ఉంటూ గత ఎన్నికల్లో రవికుమార్‌కు మద్దతిచ్చిన వారు చొరవగా ఆయన్ను కలవలేకపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులను వారు ప్రచారం చేస్తున్నారు. మండలానికి ఒకట్రెండు గ్రామాల్లో మాత్రమే ఇలాంటి సమస్య ఎదురవుతున్న నేపథ్యంలో మున్ముందు వాటిని సవరించుకునేందుకు రవికుమార్ ప్రాధాన్యత ఇస్తారా? లేదా? అనేది చూడాల్సి ఉంది.

విద్యుత్ వెలుగులు

- అద్దంకి నియోజకవర్గంలో రూ.120 కోట్లతో పనులు
- రెండు దశాబ్దాలపాటు ఎలాంటి కరెంటు సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు
- 40 ఏళ్ల నాటి స్తంభాల తొలగింపు


4

సజ్జాపురం రోడ్డు


నాడు


నేడు

చెన్నుపల్లి-వైదన రోడ్డు


నాడు


నేడు


వైదన గ్రామంలో నిర్మాణంలో ఉన్న ముస్లిం షాదీఖానా

బల్లికురవ.. అభివృద్ధి భళా!


బల్లికురవ ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

మంత్రి రవికుమార్ కృషితో పెద్దఎత్తున నిధులు

» శరవేగంగా పనులు » ఇప్పటికే చాలా వరకు పూర్తి

» బాలికా విద్యకు రూ.2 కోట్లు మంజూరు

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం అభివృద్ధిలో దూసుకుపోతోంది. మంత్రిగొట్టిపాటి రవికుమార్ పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని వైదన గ్రామంలో ముస్లిం షాదీఖానా నిర్మాణానికి మంత్రి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. పనులు తుది దశకు చేరాయి. అదేగ్రామంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం మరమ్మతులకు రూ.50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి.

మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులు రూ.4 కోట్లతో పెద్దఎత్తున సీసీ రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించారు. మరో రూ.3 కోట్ల పనులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో ప్రారంభం కానున్నాయి. పల్లె పండుగలో భాగంగా పశువుల కోసం గోకులం షెడ్లు నిర్మించారు. గ్రామాలలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.8.50 కోట్లు మంజూరయ్యాయి. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వసతి గదుల నిర్మాణానికి రూ.1.64 కోట్ల నిధులు మంజూరు కాగా.. పనులు జరుగుతున్నాయి. కొమ్మినేనివారిపాలెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.30 లక్షలు, సూరేపల్లిలో సామాజిక భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. చెన్నుపల్లి, వైదన గ్రామాల పంచాయతీ రాజ్ రోడ్డుకు రూ.3 కోట్ల నిధులు మంజురు కాగా పనులు తది దశకు చేరుకున్నాయి. కొప్పెరపాడు నుంచి వెలమవారిపాలెం వరకు ఉన్న బీటీ రోడ్డు అభివృద్ధికి రూ.4.75 కోట్లు మంజూరయ్యాయి. బల్లికురవ-అద్దంకి రోడ్డులో ఏబీసీ కాలువపై రూ.2 కోట్లతో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి పనులు తుదిదశకు వచ్చాయి. బల్లికురవ నుంచి వయా కొణిదెన మీదుగా జాతీయ రహదారికి అర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్లు మంజురయ్యాయి.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

మండలంలోని ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేలా ఆర్డీఎస్ స్కీంలో పెద్దఎత్తున నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. బల్లికురవ, వేమవరం, కొప్పెరపాడు గ్రామాల సబ్ స్టేషన్లలో లోవోల్టేజ్ విద్యుత్ లేకుండా బ్రేకర్లను ఏర్పాటు చేశారు. గ్రానైట్ పరిశ్రమలు అధికంగా ఉన్న మల్లాయపాలెం గ్రామంలో నూతంగా విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రభుత్వం మంజురు చేసింది. మంత్రి రవికుమార్ ప్రత్యేక చొరవతో అనారోగ్యం బారిన పడిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నగదు సాయం అందించారు. అలానే మంత్రి చొరవతో బల్లికురవ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వెయ్యి మంది విద్యార్థులకు సైకిళ్లు ఉచితంగా అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల 11 గ్రామాలలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల కోసం ఒక్కో భవనాకి రూ.36 లక్షలు మంజూరయ్యాయి.


బల్లికురవ పరిశ్రమలకు వెళ్లే విద్యుత్ ప్రత్యేక లైన్


వైదన గ్రామంలో అభివృద్ధి చేసిన సాంఘిక సంక్షేమ వసతి గృహం


గుంటుపల్లి కేజీబీవీ విద్యాలయంలో నిర్మాణంలో ఉన్న వసతి గృహం


జన్మదిన
శుభాకాంక్షలు
HAPPY
Birthday
వివాదరహితుడు, రైతులు, పేదల పక్షపాతి,
అందరికీ అందుబాటులో ఉంటూ... 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి
అద్దంకి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడపడంతోపాటు,
విద్యుత్ శాఖామంత్రిగా, విద్యుత్ రంగాన్ని కొత్త ప్రణాళికలతో
అభివృద్ధి పథంలో నడుపుతూ, విద్యుత్ చార్జీలు తగ్గించడానికి
నిరంతరం కృషిచేస్తున్న మా ప్రియతమ నేత,
అద్దంకి శాసనసభ్యులు, రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు..
సాదినేని ప్రసన్నకుమారి -మస్తాన్‌రావు
MPP, కొరిశపాడు
శింబోతు సత్యనారాయణ
మండల టీడీపీ అధ్యక్షులు
గ్రామ తెలుగుదేశం పార్టీ
తిమ్మనపాలెం
గ్రామ తెలుగుదేశం పార్టీ
కుర్రవానిపాలెం
గ్రామ తెలుగుదేశం పార్టీ
కొరిశపాడు
గ్రామ తెలుగుదేశం పార్టీ
& జనసేన పార్టీ
పి.గుడిపాడు
గ్రామ తెలుగుదేశం పార్టీ
రాచపూడి
గ్రామ తెలుగుదేశం పార్టీ
బొడ్డువానిపాలెం
గ్రామ తెలుగుదేశం పార్టీ
అనమనమూరు
గ్రామ తెలుగుదేశం పార్టీ
తమ్మవరం
గ్రామ తెలుగుదేశం పార్టీ
యర్రబాలెం
గ్రామ తెలుగుదేశం పార్టీ
బొల్లవరప్పాడు
గ్రామ తెలుగుదేశం పార్టీ
ప్రాసంగులపాడు
గ్రామ తెలుగుదేశం పార్టీ
పమిడిపాడు
గ్రామ తెలుగుదేశం పార్టీ
రావినూతల
గ్రామ తెలుగుదేశం పార్టీ
మేదరమెట్ల
గ్రామ తెలుగుదేశం పార్టీ
దైవాలరావూరు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు

అద్దంకికి నిధుల వరద

- పట్టణంలో రూ.12.50 కోట్లతో అభివృద్ధి పనులు
- మినీ బైపాస్‌కు రూ.15 కోట్లు..
- టౌన్ హాల్ నిర్మాణానికి రూ.3.30 కోట్లు మంజూరు

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరయ్యాయి. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి వీటిని రాబట్టారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే పెద్దఎత్తున పనులు చేపట్టారు. వీటిలో ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అద్దంకి పట్టణంలో ఏడాది కాలంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.కోటి, బీపీఎస్ఎల్ఆర్ నిధులు రూ.2.10 కోట్లు, జనరల్ ఫండ్ రూ.2 కోట్లతో ఇప్పటికే పలు కాలనీలలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం జరిగింది. ఇటీవల అద్దంకి పట్టణంలోని ఎస్సీ కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3 కోట్ల సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.1.25 కోట్లు మంజూరు కాగా పనులు చేపట్టేందుకు అంచనాలను సిద్ధం చేస్తున్నారు. అదానీ గ్రూప్స్ నుంచి సీఎస్ఆర్ నిధులు రూ.3.30 కోట్లతో పట్టణంలోని భవానీ సెంటర్‌లో అద్దంకి టౌన్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు అయ్యాయి.

మినీ బైపాస్ నిర్మాణం వైపు అడుగులు

అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతుండటంతోపాటు తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ మినీ బైపాస్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. తొలి విడతగా పట్టణంలోని మీనాక్షి రెస్టారెంట్ నుంచి కాకానిపాలెం వరకు అద్దంకి మేజర్ కాలువ కట్టలను అభివృద్ధి చేసి సీసీ రోడ్లు నిర్మించనున్నారు. అందుకు రూ.15 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు తయారు చేశారు. పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. రెండో విడతగా కాకానిపాలెం నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ సమీపంలోని 99 అడుగుల


మినీ బైపాస్ గా మార్చనున్న అద్దంకి మేజర్ కాలువ కట్ట

అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నామ్ రోడ్డులో కలిసే విధంగా తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి రవికుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. మినీ బైపాస్ నిర్మాణం పూర్తయితే పలు కాలనీల నుంచి నేరుగా రేణింగవరం రోడ్డు, ఒంగోలు రోడ్డు, శింగరకొండ రోడ్డు, బల్లికురవ రోడ్డులకు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. దీనితో పలు కాలనీలలో కొత్త ఇళ్ల నిర్మాణం పెరిగి అద్దంకి మున్సిపాలిటీకి పెద్దఎత్తున ఆదాయం కూడా సమకూరుతుంది. అద్దంకి పట్టణ రూపురేఖలు మరింత మారే అవకాశం ఉంది.



విద్యుత్ వెలుగులు

- అద్దంకి నియోజకవర్గంలో రూ.120 కోట్లతో పనులు
- రెండు దశాబ్దాలపాటు ఎలాంటి కరెంటు సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు
- నలభై ఏళ్లనాటి స్తంభాలు తొలగింపు
- కొత్త పోల్స్, లైన్‌ల ఏర్పాటు
- 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై కసరత్తు

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గం విద్యుత్ వెలుగులతో కాంతులీననుంది. వచ్చే రెండు దశాబ్దాలపాటు కరెంటు సమస్య ఉత్పన్నం కాకుండా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో రూ.120కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అద్దంకి పట్టణంతోపాటు అత్యధిక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఎక్కువ భాగం నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసినవే. దీంతో తరచూ విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రవికుమార్ వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. లోటల్టేజీ సమస్యలు ఉత్పన్నంకాకుండా కొత్త సబ్‌స్టేషన్‌లు నిర్మిస్తున్నారు. అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో సుమారు రూ.6కోట్లతో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్, ద్వారకానగర్, టిడ్కో గృహసముదాయం, కొప్పెరం, మల్లాయపాలెంలలో రూ.18 కోట్లతో కొత్తగా 33 కేవీ సబ్‌స్టేషన్‌లు నిర్మాణంలో ఉన్నాయి. సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద సుమారు రూ.25 కోటతో 132 కేవీ సబ్ స్టేషన్ మంజూరైంది. అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు వెంబడి నాలుగు సబ్‌స్టేషన్‌లను అనుసంధానం చేస్తూ సుమారు రూ.3.5 కోట్లతో విద్యుత్ టవర్ల నిర్మాణం, విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

గ్రామాలలో విద్యుత్ లైన్‌ల మార్పు

నియోజకవర్గంలోని అత్యధిక గ్రామాలలో ఏడాది క్రితం వరకు ఎక్కడ చూసిన వేలాడుతూ ఉండే విద్యుత్ తీగలు, విరిగిపడేందుకు సిద్ధంగా ఉండే స్తంభాలు దర్శనమిచి. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాతవాటి స్థానంలో ఎత్తైన విద్యుత్ స్తంభాలు, త్రిబుల్ ఫేస్ విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.80 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. కొత్తగా 160 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 10 వేల స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేక విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మరో ఐదారు నెలలో అన్ని పనులు పూర్తయి ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా మెరుగైన సరఫరా జరగనుంది. దశాబ్ద కాలం క్రితం శింగరకొండపాలెం సమీపంలో 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు జరగ్గా.. కొత్తగా 220 కేవీ సబ్‌స్టేషన్ మంజూరుకు కసరత్తు జరుతోంది. అద్దంకిలో ఏర్పాటు చేసే 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి అద్దంకి, మార్టూరు, దర్శిలలో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లకు, ఏల్చూరులో నిర్మించనున్న 132కేవీ సబ్‌స్టేషన్‌కు అందుబాటులో ఉండే విధంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. అన్ని పనులు పూర్తయితే నియోజకవర్గంలో గృహ, పరి శ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది


అద్దంకి లోని ద్వారకానగర్ వద్ద తుదిదశకు చేరిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

» ప్రకాశం జిల్లాలోకి నియోజకవర్గం » ఫలిస్తున్న మంత్రి రవికుమార్ కృషి

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా పరిధిలోకి చేర్చడంతో మూడేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో అద్దంకి నియోజకవర్గాన్ని చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో చేర్చారు. ఇక పోలీస్ సబ్ డివిజన్‌లను కూడా ఇష్టానుసారం విభజించారు. అద్దంకి, కొరిశపాడు, జె.పంగులూరు, మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లను చీరాల డీఎస్పీ పరిధి, బల్లికురవ, సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లను బాపట్ల డీఎస్పీ పరిధిలోకి చేర్చారు. దీంతో ప్రజలు మరింత అయోమయానికి గురయ్యారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల పునర్విభజనపై దృష్టి సారించింది. విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా పరిధిలోకి చేర్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అవి ఫలప్రదమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోకి చేర్చే ప్రతిపాదనతోపాటు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో అద్దంకి రెవెన్యూ డివిజన్, ప్రకాశం జిల్లా పరిధిలోకి అద్దంకి నియోజకవర్గం చేర్చే విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటైన తరువాత మిగిలిన అన్ని శాఖలకు సంబంధించి డివిజన్ కార్యాలయాలు కూడా అద్దంకిలో ఏర్పాటయ్యే అవకాశం ఉంది. డివిజన్ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంతంలో ఉంచేందుకు మంత్రి రవికుమార్ ముందస్తు ప్రణాళికతో అద్దంకి పట్టణానికి సమీపంలో రేణింగవరం రోడ్డులో సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేయించారు. దీంతో అద్దంకి నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ, ఇతర పనులకు దూరం వెళ్లే కష్టాలు తప్పనున్నాయి.


అద్దంకి పట్టణం వ్యూ

అగ్నిమాపక కేంద్రానికి సొంత గూడు

» నాడు ఎమ్మెల్యేగా రవికుమార్ కృషితో అద్దంకిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు

» నేడు రూ.2.2 కోట్లతో భవన నిర్మాణం

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అద్దంకిలో అగ్నిమాపక కేంద్రం లేదు. చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా ఒంగోలు, చిలకలూరిపేట, నరసరావుపేట, చీరాల తదితర ప్రాంతాల నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చే సరికి అంతా బూడిదయ్యేది. ఈ నేపథ్యంలో 2013 డిసెంబరులో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కృషితో అద్దంకిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటైంది. అయితే ప్రత్యేకంగా భవనం లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో తాత్కాలిక వసతి కల్పించారు. అగ్నిమాపక యంత్రం ఉంచేందుకు వీలుగా గొట్టిపాటి రవికుమార్ రూ.2 లక్షల సొంత నిధులతో రేకుల షెడ్ వేయించారు. సిబ్బంది కోసం మార్కెట్ యార్డు కార్యాలయంలో ప్రత్యేకంగా గదులు కేటాయింపు జేశారు. పలు దఫాలు అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు అయినా స్థలం అందుబాటులో లేక పోవడంతో ఆలస్యమైంది. పుష్కరకాలం తరువాత ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో రవికుమార్ మంత్రి కావడంతో అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం ఏర్పాటుపై దృష్టి సారించి అద్దంకి-శింగరకొండ మధ్య నామ్ రోడ్డు వెంబడి సుమారు రూ.2.25 కోట్లతో సొంత భవనం నిర్మాణానికి ఇటీవల మంత్రి రవికుమార్ శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మరో నాలుగైదు నెలల్లో భవన నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. పుష్కర కాలం తరువాత ఎట్టకేలకు అగ్నిమాపక శాఖ కు సొంత భవనం అందుబాటులోకి రానుంది. సిబ్బంది కష్టాలు కూడా తీరనున్నాయి.


శింగరకొండ రోడ్డులో నిర్మాణంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం భవనం

ప్రగతిలో పంగులూరు పరుగు

›› మండలంలో శరవేగంగా పనులు ›› పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు, భోజన శాలలు


ముప్పవరం జాతీయ రహదారి నుంచి పంగులూరు ఆర్ అండ్‌బీ రోడ్డును కలుపుతూ నిర్మితమవుతున్న బైపాస్ రోడ్డు

పంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్ నిరంతరం మండలంలో పర్యటిస్తూ గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారు. పల్లె పండుగ పేరుతో గ్రామగ్రామానా సీసీ రోడ్లు నిర్మించారు. మండలంలోని 21 గ్రామాలలో తొలివిడత రూ.3.30కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు నిర్మించారు. రూ.61లక్షలతో రామకూరులో సీసీ రోడ్డు, జనకవరం, కొండమంజులూరు గ్రామాలలో డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. నూతనంగా మంజూరైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లు, డ్రైన్‌ల పనులు ప్రారంభించనున్నారు. మండలంలోని కొండమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, జేవీపాలెం, జనకవరం, కొండమూరు. బూదవాడ గ్రామాలలో రూ.1.50కోట్ల డీఎంఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు.

ముప్పవరంలో రూ.3కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం

మండలంలో ప్రధాన కూడలిగా ఉన్న ముప్పవరంలో చిరకాలంగా ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన మంత్రి గొట్టిపాటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. ముప్పవరం గ్రామానికి ఉత్తరంగా జాతీయ రహదారి నుంచి పంగులూరు, ముప్పవరం ఆర్అండ్‌బీ రహదారిని కలుపుతూ 1.5 కిలో మీటర్ల నిడివితో రూ.3కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు.

రూ.5.25కోట్ల ఉపాధి నిధులతో బీటీ రోడ్ల నిర్మాణం

మండలంలో 5కోట్ల 25లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మూడు బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరగనున్నాయి. కొండమూరు గ్రామం నుంచి పంగులూరు, ముప్పవరం ఆర్అండ్‌బీ రోడ్డు వరకు 1.2 కిలో మీటర్ల నిడివిలో రూ.45లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రేణంగివరం నుంచి అలవలపాడు గ్రామం వరకు రెండు కిలో మీటర్ల పొడవున నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణానికి 2కోట్ల 80లక్షలు మంజూరయ్యాయి. మండలంలోని చందలూరు నుంచి గంగవరం వరకు 2కోట్లతో 3.6 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డును పునర్నిర్మించనున్నారు.

70లక్షల జడ్పీ నిధులతో పనులు

మండలానికి రూ.70 లక్షల జడ్పీ నిధులు మంజూరయ్యాయి. రూ.35లక్షలతో చందలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భోజన వసతి కోసం డైనింగ్ హాల్ నిర్మిస్తున్నారు. ముప్పవరంలో రూ.15లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. నూజెళ్లపల్లిలో 10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

మిగతా 7వ పేజీలో


కొండమూరు సాలిపేటలో నిర్మితమైన సీసీ రోడ్డు

మేజర్‌లు, మైనర్‌లకు మహర్దశ


- రూ.3.53 కోట్లతో సాగర్ కాలువల అభివృద్ధి
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషి
- దశాబ్దాల నుంచి ప్రమాదకరంగా ఉన్న ఏబీసీపై రూ.2 కోట్లతో హైలెవల్ వంతెన

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గతంలో సాగర్ మేజర్, మైనర్ కాలువలు చిట్టడవిలా తుమ్మ చెట్లతో నిండి ఉండేవి. ఆయకట్టులో చివర ఉన్న కాలువలు పూడిపోవడంతో ఏటా సాగుకు నీరు సక్రమంగా చేరక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టగానే రైతుల ఇబ్బందులను గమనించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలో ఉన్న అన్ని మేజర్, మైనర్ కాలువల అభివృద్ధికి రూ.3.53 కోట్ల నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. అన్ని మండలాల పరిధిలో సాగర్ కాలువల నీరు వచ్చే మేజర్, మైనర్ కాలువల అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో మేజర్ కాలువలపై ఉన్న తుమ్మచెట్లతో రైతులు రాత్రుళ్లు నడిచే పరిస్థితి కూడా లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. బల్లికురవ మండలంలో ఉన్న గుంటుపల్లి, వైదన, వెంపరాల, చెన్నుపల్లి, గొర్రెపాడు, ముక్తేశ్వరం మేజర్లతోపాటు, అన్ని మైనర్ల కాలువల్లో చెట్లు తొలగించారు. పూడిక తీయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మంత్రి రవికుమార్ చొరవతో అభివృద్ధి చేసిన గుంటుపల్లి మేజర్ కాలువ(ఫైల్)

ఏబీసీ కాలువపై ప్రమాదకర వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటుతో చెక్

దశాబ్దాల నుంచి అద్దంకి బ్రాంచ్ కాలువ వల్లాపల్లి లాకుల సమీపంలో వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఎందరో ప్రమాదాల బారినపడి ప్రాణాలను సైతం కోల్పోయారు. నిత్యం రైతులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు నియోజకవర్గ కేంద్రమైన అద్దంకి వెళ్లేందుకు ఈ వంతెన ఎంతో ముఖ్యమైనది. ప్రజల సమస్యను తెలుసుకున్న విద్యుత్ శాఖ మంత్రి గొటిపాటి రవికుమార్ హైలెవల్ వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో గత మూడు మాసాల నుంచి వంతెన పనులు దాదాపు తుది దశకు చేరాయి. ఇది పూర్తయితే పంట ఉత్పత్తుల రవాణాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించిన మంత్రి రవికుమార్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


ఏబీసీ కాలుపై రైతులకు ఉపయోగపడేలా నిర్మిస్తున్న హైలెవల్ వంతెన

ప్రగతిలో పంగులూరు పరుగు

(6వ పేజీ తరువాయి)

జరిగింది. కోటపాడు ఉన్నత పాఠశాలలో రూ.10లక్షలతో గ్రౌండ్ లెవలింగ్ పనులు చేపట్టనున్నారు.

సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవనాలు, బస్ షెల్టర్

రూ.1.55 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆరు గ్రామాలలో సామాజిక భవనాలు, బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టారు. మండలంలోని తూర్పుకొప్పెరపాడు బీసీ కాలనీలో రూ.20లక్షలు, తక్కెళ్లపాడు ఎస్సీ కాలనీలో రూ.20లక్షలు, కొండమూరు ఎస్సీ కాలనీలో రూ.40 లక్షలతో సామాజిక భవనాలు నిర్మించారు. కొండమంజులూరులో రూ.20 లక్షలు, పంగులూరు యాదవకానీలో రూ.20లక్షలు, బూదవాడలోని ధనలక్ష్మి కాలనీలో రూ.30లక్షలతో సామాజిక భవనాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. నూజెళ్లపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీల సమీపంలో రూ.5లక్షలతో బస్‌షెల్టర్ నిర్మించారు.

పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

సీఎస్ఆర్ నిధులతో మండలంలోని పంగులూరు, బూదవాడ, కొండమంజులూరు ఉన్నత పాఠశాలల్లో సుమారు వెయ్యి మంది బాలబాలికలకు సైకిళ్లను అందజేశారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో రూ.15లక్షలతో భోజనశాలను నిర్మించారు.

సాగర్ కాలువలకు మరమ్మతులు

మండలంలో అద్దంకి బ్రాంచి కాలువ పరిధిలోని పమిడిపాడు మేజర్‌తోపాటు దానికి అనుబంధంగా ఉన్న మైనర్‌లకు రూ.80లక్షలతో మరమ్మతులు చేయించారు. కాలువల్లో పెరిగిపోయిన చిల్లకంప తొలగింపు, పూడకతీత పనులు చేపట్టారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా ఉన్న కాలువలకు వ్యవసాయ సీజన్‌కు ముందే మరమ్మతులు చేపట్టడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


జన్మదిన శుభాకాంక్షలు
అనునిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, అందరి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తూ...
అందరిచేత మన్ననలు పొందుతూ, అద్దంకి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా నిలిపేందుకు
శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి జన్మదిన శుభాకాంక్షలు
Happy Birthday
డా॥ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
నాగినేని రామకృష్ణ
వ్యవసాయ మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్
మానం మురళీమోహన్‌దాస్
అద్దంకి మండల టీడీపీ అధ్యక్షులు
కరి పరమేష్
అద్దంకి రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జి
పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి
మండల టీడీపీ మాజీ అధ్యక్షులు
బండారుపల్లి శ్రీనివాసరావు
డీసీ అధ్యక్షులు
చాగంటి రాజేంద్రప్రసాద్
సొసైటీ అధ్యక్షులు ధర్మవరం
కరారి నాగేశ్వరరావు
టీడీపీ మండల మాజీ అధ్యక్షులు
బండారు రాఘవ
మాజీ ఎంపీటీసీ, చినకొత్తపల్లి
మలాది కోటేశ్వరమ్మనటరాజ్
ఎంపీటీసీ, చెరువుకొమ్ముపాలెం
పెంట్యాల రామాంజనేయులు
తెలుగు యువత, నాగులపాడు
మాదాల శ్రీనివాసరావు
వెంపరాల
అడుసుమల్లి శ్రీనివాసరావు
మాజీ సర్పంచ్, తిమ్మాయపాలెం
జొన్నలగడ్డ కృష్ణ
ధేనువకొండ
నర్రా వీరయ్య
సొసైటీ అధ్యక్షులు, మోదేపల్లి
రాయుడు నరేంద్ర
చక్రాయపాలెం
గాలం శ్రీనివాసరావు
సర్పంచ్, కుంకుపాడు
మాదాల సురేష్
వెంపరాల
భైరవునేని రామలింగయ్య
మాజీ ఎంపీటీసీ, వెంపరాల
భైరవునేని సత్యనారాయణ
సొసైటీ అధ్యక్షులు, మైలవరం
దివికోలు రాధాకృష్ణమూర్తి
ఉప్పలపాడు
నర్రా బ్రహ్మానందం
సొసైటీ అధ్యక్షులు, కొంగపాడు
షేక్ కరిముల్లా
ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షులు
మానం స్వాములు
శింగరకొండపాలెం
ధూళిపాళ్ల వీరాస్వామి
డీసీ ఉపాధ్యక్షులు, జార్లపాలెం
గుర్రం నాగరాజు
గుర్రంవారిపాలెం
యర్రా రాఘవయ్య
మాజీ సర్పంచ్, గోపాలపురం
పరిటాల శ్రీనివాసరావు
తిమ్మాయపాలెం
ఏనుగంటి వెంకటరామయ్య (బాబు)
సొసైటీ అధ్యక్షులు, బొమ్మనంపాడు
గోగులమూడి రాజశేఖర్
మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, చక్రాయపాలెం
గుడిపాటి శ్రీనివాసరావు
ఆర్.ఎం.పి, మండల టీడీపీ కార్యదర్శి
కొంగపాడు


జన్మదిన శుభాకాంక్షలు
స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు గారు
మాజీ మంత్రివర్యులు
స్వర్గీయ గొట్టిపాటి నర్సయ్య గారు
మాజీ మంత్రివర్యులు
స్వర్గీయ డా॥గొట్టిపాటి శేషగిరిరావు గారు
స్వర్గీయ గొట్టిపాటి కిషోర్ బాబు గారు
ప్రజలు మెచ్చిన నేతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ...
నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ... ప్రజల మనిషిగా గుర్తింపు పొంది
తాను ఏ పదవి చేపట్టినా, ఎంతటి ఎత్తుకు ఎదిగినా, ప్రజల కోసం ఒదిగి ఉండే
ప్రియతమ మంత్రివర్యులు శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
అమూల్య మినరల్స్
ధూళిపాళ్ల రామగోవిందు & ధూళిపాళ్ల శ్రీకాంత్
కొండాయపాలెం, బల్లికురవ మండలం
వెంకటాద్రి మినరల్స్ & బివిఎల్ రాక్స్
తలశిల వినోద్‌కుమార్
సత్యకృష్ణ గ్రానైట్స్ దివ్య గ్రానైట్
ఒట్టికొండ ఆంజనేయులు
వింటర్ గ్రానైట్స్
కక్కెర ఆంజనేయులు
K.S.R గ్రానైట్స్
కొమ్మినేని శ్రీనివాసరావు
S.R. కన్‌స్ట్రక్షన్స్
కోగంటి రామ్మోహన్‌రావు
సాయి స్టోన్స్
పత్తిపాటి సురేష్
శ్రీ శ్రీనివాస గ్రానైట్స్
ముక్కు కాశిరెడ్డి
కె.సామ్రాజ్యం గ్రానైట్, మైన్
కామేపల్లి లక్ష్మీప్రసాద్
V.K. గ్రానైట్స్
నల్లూరి హనుమంతరావు
కృష్ణసాయి ఎక్స్‌పోర్ట్సు ప్రైవేట్ లిమిటెడ్
శ్రీ శిద్దా వెంకటేశ్వరరావు
ఇంపీరియల్ గ్రానైట్స్
వి.సురేష్‌బాబు
హనుమాన్ ఎక్స్‌పోర్ట్సు
శిద్దా సూర్యప్రకాష్‌రావు, పొత్తూరి వెంకట్రావు, వెంకారెడ్డి
గిరిరాజ్ గ్రానైట్స్
రావిపూడి లక్ష్మీనారాయణ
సాయి శ్రీనివాస మినరల్స్
కొణిదెన
లక్ష్మీ గ్రానైట్స్
శిద్దా రాఘవరావు
వారాహి రాక్స్ & మినరల్స్
చెన్నుపల్లి
M.V.R. గ్రానైట్స్
మారం వెంకారెడ్డి, కొణిదెన
HAPPY Birthday
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
బల్లికురవ మండల కలర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్